ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 18 ఫిబ్రవరి 2025

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఏలూరు పోలీసు సబ్ డివిజన్‌లోని శాంతి భద్రతలు, ప్రజా సమస్యలపై ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ నిర్వహించనుంది. ఏలూరు వన్, టూ, త్రీ టౌన్, రూరల్, ట్రాఫిక్, మహిళ, సీసీఎస్, ద్వారకా తిరుమల, గణపవరం, నిడమర్రు, చేబ్రోలు, భీమడోలు, కైకలూరు టౌన్, రూరల్, ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి పోలీసు స్టేషన్ల పరిధిలోని సమస్యలపై ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ సమాధానం ఇస్తారు. సమస్యలపై ప్రజలు ఫోన్ చేయాల్సిన సమయం : బుధవారం ఉదయం 11 - 12 గంటల మధ్య..
సెల్ నెంబరు : 70136 20539



పవర్‌పేట రైల్వే గేటు వద్ద ఆగిన ట్రాఫిక్

గేట్లు.. పాట్లు

- పెరిగిన రైళ్ల రాకపోకలు.. తరచూ పడుతున్న గేట్లు
- గంటల తరబడి వాహనదారుల నిరీక్షణ.. ఆపై ట్రాఫిక్ తిప్పలు
- ఏలూరు, పశ్చిమ జిల్లాల్లో రైల్వే గేట్లతో ప్రయాణికుల అవస్థలు
- ఆర్‌వోబీలు, అండర్ పాస్‌లతోనే సమస్యలకు పరిష్కారం

రైలు గేటు పడిందా..! ఇకంతే సంగతి.. పెరిగిన రైళ్ల రాకపోకలతో ప్రతి అర గంటకు ఒకటి, రెండుసార్లు రైల్వే గేట్లు పడిపోతున్నాయి. ఫలితంగా పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని ఈ గేట్ల వద్ద వాహనదారులు చాలా సమయం నిరీక్షించాల్సి వస్తోంది. ఆపై ట్రాఫిక్‌లో నరకం చూడాల్సిందే. త్వరగా వెళ్లపోతే మళ్లీగేటు వేసేస్తారన్న భయంతో ఇబ్బందులు కొనితెచ్చు కుంటున్నారు. రద్దీగా ఉండే గేట్ల వద్ద అండర్‌పాస్‌లు, ఆర్వోబీలు నిర్మించాల్సి వుంది. దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. జిల్లాలోని ప్రముఖ రైల్వే గేట్ల వద్ద పరిస్థితిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.. 6లో..



పెదతాడేపల్లిలో ఖననం చేసిన కోళ్లు

బర్డ్‌ఫ్లూ అటెన్షన్

పెద తాడేపల్లిలో 21వేల కోళ్ల ఖననం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమలో పది రోజులుగా బర్డ్‌ఫ్లూ కలకలంతో ఇటు ప్రజలు, అటు అధికారులు అప్రమత్తమయ్యారు. తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లిలోని శ్రీరామలక్ష్మి పౌల్ట్రీలో సుమారు 21 వేల కోళ్లను సోమవారం అధికారులు ఖననం చేయించారు. పౌల్ట్రీ సమీపంలోని ప్రాంతంలో పెద్ద గొయ్యి తీయించి అనుమానిత కోళ్లను పాతిపెట్టారు. ఇప్పటి వరకు బర్డ్‌ఫ్లూ వల్ల ఎవరికీ ఇలాంటి ఇబ్బంది లేదని అధికారులు స్పష్టం చేశారు. పెద తాడేపల్లి వద్ద పశు సంవర్ధక శాఖ జేడీ మురళీకృష్ణ, పశువైద్యుల బృందంతో సమీక్షించి, మండల పరిషత్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ 21 వేల కోళ్లను ఖననం చేయించారు. గ్రామంలో సోడియం హైపోక్లోరైడ్ పిచికారీ చేయించారు. ఎంపీడీవో ఎం విశ్వనాథ్, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేశ్, పశు సంవర్ధక శాఖ ఏడీ బి.అనిల్‌కుమార్, కార్యదర్శి టి.రవిచంద్, తదితరులు పాల్గొన్నారు.



పెదతాడేపల్లిలో ట్రాక్టర్‌పై కోళ్ల తరలింపు

బర్డ్‌ఫ్లూపై ఆందోళన అక్కర్లేదు..

అగిరిపల్లి : వడ్లమానులోని పౌల్ట్రీఫార్మ్ (కోళ్ళ ఫారాలు)ల్లో బర్డ్‌ఫ్లూ లేదని నూజివీడు పశువర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.కె.చంద్రశేఖర్ తెలిపారు. గ్రామంలోని కోళ్ల ఫారాలను తనిఖీ చేశామన్నారు. బర్డ్‌ఫ్లూ వల్ల కోళ్లు మృతి చెందలేదని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. ఏడీ డా.ఎస్.రమణారావు, పశువర్ధకశాఖ అధికారి డా.సీహెచ్ హనుమంతరావు, కార్యదర్శి వెంకన్నబాబు పాల్గొన్నారు.



వడ్లమాను పౌల్ట్రీఫార్మ్ వద్ద తనిఖీలు చేస్తున్న నూజివీడు డిప్యూటీ డైరెక్టర్ డా.కె.చంద్రశేఖర్

సందేహాల యాత్ర!

విద్యార్థుల విహార యాత్రలపై గందరగోళం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బాల బాలికలను శాస్త్ర, సాంకేతికతల వైపు ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈనెల 25 లోగా నిర్వహించ తలపెట్టిన విహారయాత్రల సన్నాహాలపై కొంత అయోమయం నెలకొంది. జిల్లాలో ఎంపిక చేసిన 133 ప్రాథమిక పాఠశాలల నుంచి ఒక్కో విద్యార్థికి రూ.200 చొప్పున, 128 హైస్కూళ్ల నుంచి ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున విహార యాత్ర/అధ్యయన యాత్రల నిమిత్తం నిధులను సమగ్రశిక్ష ప్రాజెక్టుకు జమ చేశారు. ఉన్నత పాఠశాలల నుంచి నిర్ణీత అర్హతల మేరకు జిల్లాలో 27 మంది బాలురు, 54 మంది బాలికలు, 27 మంది ఉపాధ్యాయులు, 18 మంది గైడ్‌టీచర్లను విహార యాత్రలకు ఎంపిక చేస్తూ సంబంధిత జాబితాను ఇప్పటికే సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టుకు పంపించారు. విద్యాశాఖ విడుదల చేసిన నిధులతో రాష్ట్రం లోపల విహార యాత్రకు విశాఖపట్నం, రాష్ట్రం వెలుపల హైదరాబాద్‌కు తీసుకెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు ఒక్కో ప్రాంత యాత్రకు ఒక్కో విద్యార్థికి రూ.2వేలు చొప్పున రెండింటికి కలిపి మొత్తం రూ.4వేలు వంతున నిధులు విడుదలయ్యాయని ఎస్ఎస్ఏ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇంతవరకు బాగానేవున్నా 133 ప్రాథమిక పాఠశాలల నుంచి రాష్ట్రం లోపలే విహారయాత్రకు తీసుకెళ్లేందుకు ఎంత మంది విద్యార్థులను ఎంపిక చేశారు?, ఒక్కో విద్యార్థికి విహారయాత్ర నిమిత్తం కేటాయించిన రూ.200 రవాణా, భోజన, తదితర ఖర్చులకు సరిపోతాయా? అనే సందిగ్ధత నెలకొంది. దీనిపై సమగ్రశిక్ష ఇన్‌చార్జి ఏఎంవో రామారావును వివరణ కోరగా 'సైన్సు/ గణితం సబ్జెక్టుల్లో, సైన్స్ ఫెయిర్లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, విజేతలను విహార యాత్రలకు తీసుకెళ్తాం. ఆర్టీసీ బస్సులనే విని యోగిస్తాం. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అంగీకారాన్ని తీసుకోవాల్సి ఉంది. ఏ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు చేపడతాం. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు తలపెట్టిన విహార యాత్ర గురించి నెలకొన్న సందేహాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకుంటాం.' అని వివరించారు.

జీబీఎస్.. పని పట్టేలా!



వ్యాధి నియంత్రణకు మూడంచెల్లో ముందస్తు చర్యలు

- ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పది పడకలతో ప్రత్యేక వార్డు
- ఏడాది కాలంలో జిల్లాలో జీబీఎస్ కేసు ఒక్కటీ నమోదు కాలేదన్న వైద్యనిపుణులు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆందోళన కలిగిస్తోన్న గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి జాడలను ముందస్తుగా గుర్తించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఉమ్మడి కార్యాచరణను యుద్ధప్రాతిపదికన ప్రారంభించింది. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ మూడు విభాగాలను నియంత్రించే డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, డీఎంఈ జిల్లా అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి, జిల్లా స్థాయి నివారణ/నియంత్రణ/ అవగాహన చర్యలను చేపట్టారు.

అన్ని పీహెచ్‌సీల్లో సోమవారం నుంచి కీళ్ల నొప్పులు, అతిసార, చేతులు తిమ్మెర్లు, వంకర్లు రావడం, అకస్మాత్తుగా రక్తపోటు పెరగడం వంటి జీబీఎస్ అనుమానిత లక్షణాలతో ఆస్పత్రి ఓపీ విభాగాలకు వచ్చే రోగులు, ఆరేళ్ల లోపు పిల్లలపై నిశిత పరిశీలన చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని నేతృత్వంలో వైద్యాధికారులకు సూచనలు పంపారు. ఇదే క్రమంలో సంబంధిత రోగాలను పర్యవేక్షించే జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఇంటిగ్రేటెడ్ డిసీజెస్ సర్వైలెన్స్ ప్రోగ్రాం (ఐడీఎస్‌పీ) ఆధ్వర్యంలో నీటినాణ్యత పరీక్షలు, డయేరియా కేసులతో పాటు, జీబీఎస్ అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించేందుకు ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌సీడీ ఇంటింటా సర్వే సిబ్బందికే అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక విజయవాడ ప్రభుత్వ పాత ఆస్పత్రిలో జీబీఎస్ అనుమానిత లక్షణాలతో చేరిన చింతలపూడి మండలం యర్రగుంటపల్లికి చెందిన ఐదేళ్ల బాలిక ఆరోగ్యం మెరుగ్గా ఉందని వైద్యవర్గాలు తెలిపాయి. జిల్లాలో ఇంతవరకు జీబీఎస్ కేసు ఒక్కటీ నిర్ధారణ కానప్పటికీ ముందస్తు జాగ్రత్తలపై డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అత్యవసర వైద్యవిభాగం (ఈఎండీ)లో పది పడకలతో జీబీఎస్ ప్రత్యేకవార్డును ప్రారంభించాలని సోమవారం సాయంత్రం నిర్ణయం తీసుకున్నారు. ఇందులో ప్రతీ బెడ్‌కు వెంటిలేటర్, ఆక్సిజన్, తదితర సదుపాయాలను కల్పిస్తున్నట్టు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు, జీబీఎస్ ప్రత్యేకవార్డు ఇన్‌చార్జి డాక్టర్ సుధాకర్ వెల్లడించారు. ఈ ప్రత్యేక వార్డు మంగళవారం ప్రారంభమవుతుందన్నారు. కాగా ఆస్పత్రిలో ఇప్పటికే ఇతర రోగులతో బెడ్‌లు నిండిపోయి వార్డులన్నీ కిక్కిరిసినట్టు తెలిసింది. అయినప్పటికీ జీబీఎస్ రోగుల కోసం ఒక వార్డును ప్రత్యేకించడానికి నిర్ణయం తీసుకున్నారు. జీబీఎస్ రోగుల కోసం వినియో గించేందుకు ప్రధాన మందు ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్ల నిల్వలు సంతృప్తికరంగానే ఉన్న ట్టు వైద్యనిపుణులు వెల్లడించారు. జీబీఎస్ నిర్ధారణ అయిన రోగికి ఒక్కొక్కటి రూ.20 వేలు ఖరీదు చేసే ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్ రోజుకి ఐదు చొప్పున ఐదు రోజుల పాటు ఇవ్వాల్సి ఉంటుంది.

జీబీఎస్‌పై ఆందోళన వద్దు..

జీబీఎస్ నిర్ధారణ అయినరోగికి ట్రీట్‌మెంట్‌ను వెంటిలేటర్‌పై ఇవ్వాల్సి ఉంటుంది. ఏడాదిగా జిల్లాలో ఒక్క జీబీఎస్ కేసు నిర్ధారణ కాలేదు. ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్ల నిల్వలు ఇప్పటికే ఉన్నాయి. మరికొన్ని వచ్చే అవకాశం ఉంది. కరోనా మాదిరిగా జీబీఎస్ అంటువ్యాధి కానందున భయపడక్కర్లేదు. 85 శాతం చికిత్స అవసరం లేకుండానే తగ్గుతుంది. మిగతా 15 శాతం మేర మాత్ర మే ఇంజెక్షన్లు అవసరమవుతాయి.

- డాక్టర్ సుధాకర్, జీబీఎస్ ప్రత్యేక వార్డు ఇన్‌చార్జి

ఎస్సీ వర్గాలకు అండగా..!

- కూటమి ప్రభుత్వంలో స్వయం ఉపాధి రుణాలు
- ఈ ఆర్థిక సంవత్సరంలో 840 యూనిట్లు
- వైసీపీ ప్రభుత్వంలో సబ్సిడీ రుణాలకు చెల్లుచీటీ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గాల్లో నిరుద్యోగ యువత, మహిళలకు కూటమి ప్రభుత్వం శుభవార్త తెలిపింది. సబ్సిడీపై ఎస్సీ వర్గాలకు రుణాలు అందించే క్రమంలో కూటమి ప్రభుత్వం జిల్లాకు నిధులు కేటాయించింది. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ వర్గాలకు సబ్సిడీపై రుణాలు ఇచ్చే పథకాలకు మంగళం పలికింది. ఈ కారణంగా గత ఐదేళ్లలో అనేకమంది ఎస్సీ నిరుద్యోగ యువత ఉపాధి లేక అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా, సెర్ప్ ద్వారా రూ.28 కోట్లు మంజూరు చేసింది. దీంతో 840 యూ నిట్లు నెలకొల్పేందుకు మార్గం సుగమమైంది. లబ్ధిదారుని వాటా ఐదు శాతం, సబ్సిడీ 45 నుంచి 60 శాతం, బ్యాంకు రుణం 45 శాతం గా స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేస్తారు. అత్యధికంగా రూ.లక్ష వరకు రాయితీ ఇవ్వనున్నారు. మార్చి 31 లోగా ఈ రుణాల కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయనున్నారు.

రెండు శ్లాబులుగా రుణాలు

రెండు శ్లాబులుగా రుణాలను విభజించారు. ఒకటి మహిళలకు ఉన్నతి పథకం ద్వారా యూనిట్లు, మరొకటి బ్యాంకు లింకేజీ ద్వారా యూనిట్లు మంజూరు చేస్తారు. ముఖ్యంగా ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ వర్గాల్లో డ్వాక్రా సభ్యులైన మహిళలకు రుణాలు అందజేస్తారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అత్యధికంగా రూ.లక్ష, తక్కువగా రూ.50 వేలు రాయితీ అందిస్తారు. లబ్ధిదారులు పది శాతం వాటా సమకూర్చాల్సి ఉంది. వస్త్రవ్యాపారం, కిరాణా, ఫ్యాన్సీ, పెయింటింగ్, ఫ్యాషన్ డిజై నింగ్ వంటి యూనిట్లు మంజూరు చేస్తారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కల్పించే రుణాలను స్వయం ఉపాధి, రవాణా, వ్యవ సాయం, పశుసంవర్ధక శాఖ రుణాలు.. అనే నాలుగు కేటగిరిలుగా విభజిం చారు. ఫ్యాన్సీ, ఆటోలు, కిరాణా దుకాణాలు, వ్యవసాయ పరికరాలు, గేదెలు, మేకలు, గొర్రెలు, చెప్పుల దుకాణాలు వంటి వాటికి రుణాలు అందజేస్తారు.

కోడ్ ముగిశాక దరఖాస్తుల స్వీకరణ

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఈ రుణాలకు దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.



ఈ-పంట నమోదులో ముందంజ

- జిల్లాలో ఇప్పటికే 95 శాతం పూర్తి
- పంట సాగు విస్తీర్ణం లక్షా 90 వేల ఎకరాలు
- ఈ-పంట నమోదు లక్షా 70 వేల ఎకరాలు

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి రైతులకు లభించే పథకాలు అమలవుతాయి. జిల్లాలో ఈ-పంట నమోదు 95 శాతం పూర్తయిందని జిల్లా వ్యవ సాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో రబీ సాగులో అన్ని పంటల విస్తీర్ణం 2.59 లక్షల ఎకరాలు కాగా ప్రస్తుతం జిల్లాలో రబీలో అన్ని పంటలు కలిపి లక్షా 90 వేల ఎకరాల్లో సాగవుతోంది. ఈ మేరకు ఈ- పంట నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 57 వేల 877 మంది రైతులకు చెందిన లక్షా 70 వేల ఎకరాలకు (95 శాతం) నమోదు పూర్తయింది. ఇందులో వీఏఏ అథెంటికేషన్ లక్షా 61 వేల ఎకరాలకు జరగ్గా, వీఆర్వో అథెంటికేషన్ లక్షా 45 వేల ఎకరాల్లో పూర్తయింది.

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో నూరుశాతం ఈ-పంట నమోదు పూర్తి కాగా, 20 మండలాల్లో 90 శాతం, మూడు మండలాల్లో 80, రెండు మండలాల్లో 70 శాతం పైగా ఈ-పంట నమోదు పూర్తయింది. వీఆర్వో అథెంటికేషన్ జిల్లాలో 90.3 శాతం పూర్తికాగా ఇందులో కలిదిండి, కైకలూరు, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో నూరుశాతం పూర్తయింది. మిగిలిన మండలాల్లో వీఆర్వో పరిశీలన జరుగుతోంది ఈ-పంట నమోదు ప్రక్రియలో ఈ-కేవైసీ ప్రధానమైన ప్రక్రియ. రైతులు పండించే సాగు విస్తీర్ణం ఈ-పంటలో నమోదు చేసిన తర్వాత రైతు బయో మెట్రిక్ తీసుకుని ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలి. ఈ ప్రక్రియ కొంత మందకొడిగా నడుస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు ఈ-కేవైసీ 51.2 శాతమే పూర్తయింది. అయితే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో నూరుశాతం పూర్తయింది. ఉంగుటూరు, మండవల్లి మండలాల్లో 30 శాతం లోపు పూర్తవ్వగా 11 మండలాల్లో 50 శాతం కన్నా తక్కువగా, మిగిలిన మండలాల్లో 50 శాతం పైగానే ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిందని నివేదికలు చెబుతున్నాయి.

ఈ-పంట నమోదులో ప్రథమం..

జిల్లాలో ఈ-పంట నమోదు వేగవంతంగా జరుగుతోంది. జిల్లాలో 95 శాతం ఇప్పటికే పూర్తయింది. మిగిలిన పంట పొలాలకు సంబంధించి త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాం. ఈ-పంట నమోదులో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం నిలిచాం.

- హబీబ్‌బాషా, జిల్లా వ్యవసాయ శాఖాధికారి



తమ్మిలేరు ప్రాజెక్టు కుడి కాల్వలో ఎర్త్ వర్కు పనులు

శరవేగంగా తమ్మిలేరు పనులు

- మంత్రి పార్థసారథి చొరవతో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు వేగవంతం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

చాట్రాయి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు రైతుల ఏళ్ల నాటి ఎదురు చూపులు ఫలిస్తున్నాయి. నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడడంతో పనులు శరవేగంగా జరుతున్నాయి. కుడి, ఎడమ, మధ్య కాల్వల్లో రక్షణ గోడలు, సూపర్ పాస్‌లు, రెగ్యులేటర్స్ తదితర పనులు జరుగుతున్నాయి. గత ఆరేళ్ల నుంచి ఆశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్న అన్నదాతలు జరుగుతున్న పనులను చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు. 50 ఏళ్ల క్రితం ప్రాజెక్టు నిర్మాణం జరగ్గా తర్వాత సరైనా మరమ్మతులు చేయకపోవడంతో జలాశయం కట్ట, రెగ్యులేటర్ గేట్లు, జలాశయం తూములు, పంట కాల్వలు, ఆయకట్టు చెరువులు, కల్వర్టులు శిథిలావస్థకు చేరి పంట భూములకు నీరు అందక రైతులు నష్టపోతున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతులకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కృషితో రూ.16 కోట్లు జపాన్ బ్యాంకు (జైకా) నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయి కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టే సమయానికి 2019 ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులకు బ్రేక్ పడింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రివర్స్ టెండరింగ్ పేరుతో టెండరు రద్దు చేసింది. 2021లో టెండరు పిలిచి కాంట్రాక్టర్‌ను ఖరారు చేసినా ఎడమ కాల్వలో కేవలం రూ.1.64 కోట్లు పనులు మాత్రమే జరిగాయి. వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు విడుదల కాకపోవడం వల్ల పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి పార్థసారథి ప్రాజెక్టును సందర్శించి పనులు పునఃప్రారంభానికి చర్యలు తీసుకున్నారు.

'జైకా నిధులతో తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మత్తు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎడమ, కుడి, మధ్య కాలువల్లో పనులు నడుస్తున్నాయి. నీటి సంఘాల అధ్యక్షులు రైతులు అధికారులు సమన్వయంతో వర్షాకాలం లోపు అధిక శాతం పనులు పూర్తి చేయటానికి కృషి చేస్తున్నా'మని తమ్మిలేరు ప్రాజెక్టు డీఈఈ బి.సీతారామ్ తెలిపారు.



తమ్మిలేరు ప్రాజెక్టు కుడి కాల్వలో క్యూరింగ్ పనులు

సమన్వయంతో పనులు..



మంత్రి పార్థసారథి మార్గనిర్దేశంలో అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు, ఆయకట్టు రైతు లు సమన్వయంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. జైకా నిధులు రూ.16 కోట్లతో వచ్చే వర్షాకాలంలోగా అధిక శాతం పనులు పూర్తి చేసి తమ్మిలేరు ప్రాజెక్టును పటిష్ఠం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

- యర్రా రమేశ్, తమ్మిలేరు ప్రాజెక్టు నీటి సంఘం అధ్యక్షుడు

వామ్మో.. గేటు పడుద్ది!

రైళ్ల రాకపోకల నుంచి ప్రజలను అప్రమత్తం చేసేందుకు వారిని ప్రమాదాల నుంచి కాపాడేందుకు ఏర్పాటు చేసేవే రైల్వేగేట్లు. అయితే అవే గేట్లు ఇప్పుడు ప్రజలకు నరకం చూపిస్తున్నాయి.. రైల్వే గేట్లతో చాలా ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గేటు పడితే గంటల తరబడి నిరీక్షణ, కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు.. రైల్వేలైన్లు, రైళ్లు పెరగడంతో ఎక్కువసార్లు గేట్లు పడుతున్నాయి. దీంతో ప్రయాణికులకు కష్టాలు కూడా పెరిగాయి.. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రైల్వే గేట్ల పరిస్థితిపై ఆంధ్రజ్యోతి ఫోకస్..





ఆకివీడు అండర్‌పాస్ బ్రిడ్జికి అడ్డంకులు

ఆకివీడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు ప్రజలు, రైల్వే ప్రయాణికులకు కష్టాలు పెరిగాయి. గతంలో ఒక గూడ్సు వెళ్లని పరిస్థితి నుంచి నేడు రోజుకు సుమారు 25 గూడ్సు రాకపోకలు జరుగుతున్నాయి. ఎక్స్‌ప్రెస్, పాసింజర్లు కలిపి సుమారు 43 నడుస్తున్నాయి. ఆకివీడు రైల్వే స్టేషన్‌కు ఇరువైపులా దుంపగడప, సిద్ధాపురం వైపు వెళ్లేందుకు రైల్వే గేట్లు ఉండడంతో పాటు కూతవేటు దూరంలో గుమ్ములూరు వైపు కూడా రైల్వేగేటు ఉండ డంతో గేటు పడితే 20 నిమిషాలు వేచి ఉండాల్సి వస్తున్నది. ఎడా పెడా రైళ్ల రాకపోకలు జరిగితే సుమారు 40 నిమిషాలు పడుతుండడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు స్థానికులు, వర్తకులు, ఉద్యోగులు అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటున్నారు.అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని ఎప్పటినుంచో కోరుతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు పలుగేట్లు దగ్గర మట్టి పరీక్షలు చేశారు.

• అండర్‌పాస్ నిర్మాణానికి అడ్డంకులు



ఆకివీడు రైల్వేగేట్ల దగ్గర అండర్‌పాస్ నిర్మాణానికి కొందరు ప్రజా ప్రతినిధులు అడ్డుకుంటున్నారు.డబుల్ లైన్, విద్యుదీకరణ చేయడంతో గూడ్సు ట్రైన్లు పెరిగాయి. గేటు పడితే సుమారు 30 నిమిషాలు కావస్తుండడంతో విద్యార్థులు, వర్తకులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య కారణంగా సొంత ఇల్లు ఉన్నవారు ఖాళీ చేసి బయట అద్దెలకు ఉంటున్నారు.

- డోకల రవితేజ, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు, ఆకివీడు

• అండర్ పాస్ ఏర్పాటు చేయాలి



ఆకివీడు ప్రాంతంలో ఉన్న మూడు గేట్లకు సంబంధించి ఒక గేటు దగ్గర అండర్ పాస్ ఏర్పాటు చేసి మూడు గేట్లుకు అనుసంధానంగా రహదారి నిర్మిస్తే గాని సమస్యలు తీరవు. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, రైల్వే అధికారుల దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లి వినతిపత్రాలు ఇచ్చాం. నేటికీ పరిష్కారం కాలేదు.

- పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్, ఆకివీడు

మొండిగేటుకు మోక్షమెపుడు ?


దుంపగడప వద్ద ఉన్న రైల్వే గేటు (మొండిగేటు)

ఆకివీడురూరల్ : ఆకివీడు మండలం దుంపగడప వద్ద ఉన్న రైల్వేగేటు (మొండిగేటు) సామా న్యుల జీవనానికి అవరోధంగా మారింది. ఆకివీడు-ఉప్పుటేరు జాతీయ రహదారి నుంచి దుంపగడప గ్రామానికి, రైస్‌మిల్లులకు వెళ్లేందుకు ఈ రహదారి ఎంతగానో ఉపయోగ పడుతుంది. మొదట్లో ఇక్కడ గేటు ఉండేది కాదు. రైళ్ల రద్దీ పెరగ డంతో గేటు ఏర్పాటు చేశారు. రోజూ కూలి పనులకు, వ్యవసాయం, ఆక్వా, రైస్‌మిల్లింగ్, పాడి పరిశ్రమ నిమిత్తం నిరంతరం ప్రజలు ఈ గేటు మార్గంలో ప్రయాణించాల్సి ఉంది. "డబల్ లైను కావడం, రైళ్ళ రాకపోకలు పెరగడంతో ప్రతి అరగంటకు గేటు పడుతుంది.. కైకలూరు వైపు నుంచి వచ్చే రైళ్లకు కైకలూరు స్టేషన్ వదలగానే గేటు వేసి ఆకివీడు స్టేషన్‌కు వెళితేగాని గేటు తియ్యరు. భీమవరం నుంచి వచ్చే రైళ్ళకు ఉండి స్టేషన్‌కు రాగానే గేటు వేసి ఆలపాడు గేటు దాటితేనే గాని గేటు తియ్యడం లేదు.. గేటు పడిందా.. సుమారు 30 నిమిషాల పాటు వేచి చూడాల్సి వస్తుందని" ప్రయాణికులు వాపోతున్నారు. గేట్ ఇబ్బందులు వల్ల రియల్ ఎస్టేట్ కుదేలైంది. ఎవరు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదని వ్యాపారస్థులు తెలియజేస్తున్నారు. నిర్మాణానికి సిద్ధమైన అపార్టుమెంట్లు ఆగిపోయాయి. అద్దె ఇళ్లు ఖాళీ అయ్యాయి. అండర్ పాస్ నిర్మించేందుకు మొండిగేటు ప్రాంతాన్ని రైల్వే, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.


కె.సముద్రపుగట్టు రైల్వే గేటు వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

ఈ రూట్‌లో అరగంటకోసారి..

ఇరగవరం : గేటు పడిన ప్రతిసారి తణుకు పరిసర వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. నిడదవోలు-భీమవరం రైల్వే లైన్ గతంలో సింగిల్‌గా ఉండేది. అయితే ఇటీవల రెండు లైన్లతో మార్పులు చేయడంతో రైళ్ల రద్దీ పెరిగింది. రోజుకు సుమారు 50 రైళ్లకు పైగా రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో అధికంగా పగటిపూట ప్రయాణం జరుగుతున్నాయి. దీంతో అర గంటకు ఒకసారి ఈ మార్గంలో గేటు పడుతుంది. తణుకులోని వెంకట్రాయపురం, తణుకు- అత్తిలి మార్గంలోని కె.సముద్రపుగట్టు వద్ద ఉన్న గేటుతో సమీప గ్రామాల నుంచి నిత్యం అనేక మంది వాహనదారులు ప్రయాణిస్తూ ఉంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో ఆర్వీబీ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లాలన్నా కష్టతరమవుతుంది. గేటు వేసిన ప్రతిసారి 20 నిముషాల పాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

• వంతెన నిర్మాణాలు చేపట్టాలి : జి.రమేష్



రైల్వే గేటు పడిన సమయంలో 20 నిముషాలు వేచి ఉండాల్సి వస్తుంది. ఒక రైలు వెళ్లిన తరువాత ఒక్కోసారి మరో రైలు కూడా వస్తుంది. దీంతో దూరమైనా మరో మార్గం నుంచి వెళుతున్నాం. వంతెన నిర్మాణాలు చేపడితే ఇబ్బందులు తప్పుతాయి. నీడకు ఆగుదామంటే రైల్వే గేట్ల వద్ద ఉన్న చెట్లను కూడా నరికివేస్తున్నారు.

ఉంగుటూరు మండలంలో ఐదు ..

ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలోని కైకరం, చేబ్రోలు, ఉంగుటూరు, నాచుగుంట, బాదంపూడి రైల్వే గేట్ల వల్ల ప్రయాణికులు వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేబ్రోలు రైల్వే గేటు సమీపంలో దాత బూరుగుపల్లి వీరాంజనేయులు తన సొంత ఖర్చులతో అండర్ పాస్ నిర్మించడంతో ద్విచక్ర వాహనదారులు, చిన్నకార్లు ఎప్పటికప్పుడు వెళ్ళిపోతున్నాయి. ఉంగుటూరు బాదంపూడి, నాచుగుంట రైల్వే గేట్లు తరచూ పడడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. తొలి విడతగా కైకరంలో ఫ్లైఓవర్ మంజూరైంది. ప్రధాన సమస్యగా ఉన్న చేబ్రోలు రైల్వే గేటుకు ప్రత్యామ్నాయం లేకపోవడంపై స్థానికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పాలకొల్లు గేటు వద్ద సోమవారం సాయంత్రం ట్రాఫిక్

రైల్వే గేట్ల వద్ద ప్రయాణికుల పాట్లు
గంటల కొద్దీ నిరీక్షణ.. ట్రాఫిక్ జామ్
పెరిగిన రైల్వే లైన్లు, రైళ్లతో గంటకోసారి గేటు..
ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ నిర్మాణాలు అవసరం
కొన్నిచోట్ల ప్రతిపాదనలు.. కొన్ని చోట్ల అడ్డంకులు


నవాబుపాలెం గేటు వద్ద ట్రాఫిక్ రద్దీ

బాబోయ్ నవాబుపాలెం గేటు..

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం రైల్వేగేటు పేరు చెబితే వాహన చోదకులు హడలెత్తి పోతుంటారు. అధికారుల నుంచి ప్రజా ప్రతినిధుల వరకూ ఈ రైల్వేగేటు నుంచి తప్పించుకునేందుకు వేరే మార్గాల గుండా ప్రయానిస్తున్నారు.ఈ రైల్వేగేటు రోజుకు కనీసం 40 సార్లకు పైగానే పడుతుంది. ఒకసారి గేటు పడిందంటే ఇక అక్కడే పడిగాపులు తప్పవని ఫిక్స్ అయిపోతుంటారు. దీనికి తోడు ఈ గేటు సమీపంలో ఎఫ్‌సీఐ గోదాములు ఉండటంతో గూడ్స్ రైలు వచ్చిందంటే గంటల తరబడి ఆ గూడ్స్ అన్‌లోడ్ చేసేంత వరకూ ఆగాల్సిందే. గూడ్స్ రైలు ఆగితే ఐదు కిలోమీటర్లు తిరగేసుకుని రావడమే నయం అని రూటు మారుస్తుంటారు. సుమారు 10 గ్రామాలకు ఇదే ప్రధానదారి కావడం పక్కనే క్వారీలు ఉండటంతో ఆ లారీల రద్దీకి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడం ఇక్కడవారికి అలవాటే..ఈ సమస్య పరిష్కరించాలని ఏళ్ల తరబడి ఈ ప్రాంత ప్రజలు అడగని నాయకుడు లేడు.. కోరని అధికారి లేడు.

పాలకొల్లులో రోజుకు 24 సార్లు..

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు-భీమ వరం రోడ్డులో పాలకొల్లు లాకుల వద్ద నుంచి పూలపల్లి మధ్యలో ఉన్న రైల్వే గేటు రోజుకు సుమారు 24 సార్లు గేటు పడుతుంది. ఉదయం 7 నుంచి 9.30 , సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య విద్యార్థులు,ఉద్యోగులు సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నరసాపురం నుంచి భీమవరం వైపు ప్రతీ రోజూ 12 సాధారణ రైళ్ళతో పాటు, 3 స్పెషల్ రైళ్లు నడుస్తాయి.గేటుకు భీమవరం వైపు ఎఫ్‌సీఐ, ఎంపీడీవో కార్యాలయాలు, నాలుగు కళాశాలలు, కళ్యాణ మండపాలు, బ్యాంకులు, ఆలయాలు ఉన్నాయి. సుమారుగా 18 వేల మంది వరకూ ఈ ప్రాంతంలో నివసిస్తుంటారు. ఇక ప్రధాన పట్టణం లాకుల వైపు ఉంది. ఇక్కడ అనేక విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్ ఉన్నాయి. గేటు పడిన సమయంలో సుమారు 15 నిముషాలు వేచి ఉండాలి.. గేటు తీసిన తరువాత ట్రాఫిక్ వల్ల మరో 10 నిముషాలు పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఏలూరు నగరంలో నరకయాతన

ఏలూరు క్రైం: ఏలూరు నగరంలోని ప్రజలకు నగరానికి వచ్చి వెళ్ళే ప్రజలకు రైల్వే గేట్లతో నిత్యం ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. గతంలో వట్లూరు, శ్రీనివాసథియేటర్ , పవర్‌పేట , గన్‌బజార్, పెద్ద రైల్వే స్టేషన్ , నిమ్మకాయల మార్కెట్‌యార్డు వద్ద రైల్వే గేట్లు ఉండేవి. అప్పట్లో ఏలూరు నగరం దాటాలంటే ప్రజలు నరకం చూసే వారు. వట్లూరు, గన్‌బజార్ వద్ద ఫ్లైఓవర్‌లు నిర్మించారు. శ్రీనివాస థియేటర్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించారు. పెద్ద రైల్వేస్టేషన్ వద్ద ఉన్న గేటును పూర్తిగా మూసివేశారు. ప్రస్తుతం ఏలూరు నగరంలో పవర్‌పేట, మార్కెట్‌యార్డు రైల్వేగేట్లు ఉన్నాయి. ఏలూరు నగరం మీదుగా విశాఖపట్టణంవైపు 32 రైళ్లు వెళ్తుండగా, విశాఖ పట్టణం నుంచి 33 రైళ్ళు విజయవాడవైపు వెళ్తున్నాయి. ఏలూరులో ఆగ కుండా వెళ్లే రైళ్ళు మరో 15 ఉన్నాయి. 65 గూడ్స్ రైళ్ళు ఏలూరు మీదుగా అటు ఇటు రాకపోకలు సాగిస్తున్నాయి. మొత్తం మీద 145 రైళ్లు ఏలూరు మీదుగా 24 గంటలు రాకపోకలను కొనసాగిస్తున్నాయి. పవర్‌పేట గేటు, వన్‌టౌన్, టూటౌన్ ప్రాంతాల ప్రజలు వెళ్ళడానికి ఎంతో అనుకూలమైనవి. దీంతో గేటు పడిందంటే ప్రజలు నరకయాతన పడాల్సిందే. ఒక్కోసారి నాలుగు, ఐదు రైళ్లు వెళ్లేవరకూ గేటు తీయరు. రాత్రి 9 గంటల నుంచి 10.30 గంటల వరకూ, ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకూ ఈ గేటు తీసే సమయం తక్కువ. ఇక్కడ ఇబ్బందులను ప్రభుత్వాల దృష్టికి అనేక మార్లు తీసుకువెళ్ళారు. చివరకు అక్కడ ఫ్లైఓవర్ నిర్మించడానికి ఏడాది క్రితం ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకూ రోడ్లు భవనాల శాఖ అధికారులు ఎలాంటి టెండర్లను పిలవలేదు. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు రైలు పట్టాలు ఇరువైపులా బ్రిడ్జిని ఏర్పాటు చేయగా రైలు పట్టాలు ప్రాంతం బ్రిడ్జిని రైల్వే శాఖ నిర్మిస్తుంది. పవర్‌పేట గేటు సమస్యను ఇప్పటి వరకూ ప్రజా ప్రతినిధులు కాని, అధికారులు కాని పట్టించుకోక పోవడంతో ఆ సమస్య అలాగే ఉండిపోయింది. పవర్‌పేట వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేసే ప్రతిపాదనలు గతంలో చేసినప్పటికీ శ్రీనివాసథియేటర్ సమీపంలో ఏర్పాటు చేసిన అండర్ బ్రిడ్జి నుంచి నీరు ఊరుతూనే ఉండడం 24 గంటలు రెండు మోటార్లు పెట్టి తోడించడం జరుగుతూనే ఉంది. అందువల్ల ఈ ప్రతిపాదనను పూర్తిగా విరమించుకున్నారు. ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మించాలంటే సాధ్యపడే విషయం కాదని చెప్తున్నారు. రోజురోజుకూ పట్టాలపై రైళ్ళు పరుగులు పెట్టే సంఖ్య పెరిగిపోవడంతో పవర్‌పేట గేటును పూర్తిగా మూసివేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

దెందులూరులో దశాబ్దాలుగా పోరాటం



దెందులూరు : ఎన్ని ప్రభుత్వాలు మారిన తమ తలరాతలు మారడం లేదని దెందులూరు రైల్వే గేటు వల్ల మెట్ట గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయని దెందులూరు-శ్రీరామవరం రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని దెందులూరు మండల ప్రజలు కోరుతున్నారు. గేటుపడితే నాలుగైదు రైళ్లు వెళ్లే వరకూ గేటు తీయక పోవడంతో 30 నిమిషాల పాటు వాహనాలు నిలిచిపోతున్నాయని వాపోతున్నారు. దశాబ్దాలుగా రైల్వేగేట్లతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. సమస్య పరిష్కరించాలని రామారావుగూడెం గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీ, వెనుకబడిన వర్గాల పోరాట సమితి అధ్యక్షుడు మద్దా భూషణం కోర్టును ఆశ్రయించడంతో పాటు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఫ్లైఓవర్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అండర్ పాస్ మంజూరు చేసింది. అయితే ద్వారకాతిరుమల దేవస్థానం రహదారి కావడంతో పాటు పలు వ్యాపార, పారిశ్రామిక ఫ్యాక్టరీలు ఉండటంతో అండర్ పాస్ వద్దని ఫ్లైఓవర్ నిర్మించాలని గ్రామస్థులు తీర్మానం చేసి పంపారు. దీంతో దెందులూరు రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ కలగానే మిగిలిపోయిందని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

• మెట్ట గ్రామాలు అభివృద్ధికి దూరం



రైల్వేగేటు వల్ల మెట్ట గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. గేటు పడితే గంటల తరబడి ప్రజలు వేచి ఉండవలసి వస్తోంది. అత్యవసర వైద్యసేవలు పొందేందుకు రోగులను తరలించేందుకు అంబులెన్స్‌లు సైతం అరగంట పాటు నిలిచిపోవాల్సి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలి. ఎంపీ మహేష్ యాదవ్, మంత్రి లోకేష్‌ను కలిసి ఫ్లైఓవర్ నిర్మాణాకి చర్యలు తీసుకోవాలని కోరాం.

- మద్దా భూషణం, రామారావుగూడెం, ఫ్లై ఓవర్ పోరాట సమితి అధ్యక్షుడు

• ఫ్లైఓవర్ నిర్మించాలి



రైల్వే గేటు వల్ల ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నాం. కష్ట నష్టాలకోర్చి చిన్న తరహా ఫ్యాక్టరీ నడుపుతున్నా గేటు వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. అండర్ పాస్ నిర్మాణానికి మంజూరవగా గ్రామస్థులు వద్దని తీర్మానం చేశారు. ఫ్లైఓవర్ నిర్మించాలని అందరూ కోరుతున్నారు.

- కలపాల చంద్రశేఖర్, వ్యాపారవేత్త, దెందులూరు


ఎంపీ పుట్టా మహేష్‌కు వినతిపత్రం ఇస్తున్న కూటమి నాయకులు

రైల్వే అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని వినతి

పెదపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వట్లూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నుంచి అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కూటమి నాయకులు కొమ్మన లక్ష్మణమోహన్, కొమ్మన వెంకట శ్రీధర్‌ల ఆధ్వర్యంలో ఎంపీ మహేష్ కుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అండర్ పాస్ ఏర్పాటుతో 2,500 ఎకరాల ఆయకట్టు రైతులకు, పశువులు, ధాన్యం రవాణాతో, పరిసర గ్రామాల ప్రజల రాకపోకలకు మార్గం ఏర్పడుతుందని వివరించారు. రైల్వే, సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని ఎంపీ హామీ ఇచ్చారు.


నరసాపురం స్టేషన్‌లో బారులు తీరిన ప్రయాణికులు (ఫైల్ ఫొటో)

అరకొరగా జనరల్ బోగీలు

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

నరసాపురం, తణుకు ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దూర ప్రాంతాలకు నరసాపురం రైల్వేస్టేషన్ నుంచి నిత్యం ఐదు ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లు బయలు దేరుతుంటాయి. వాటిలో లింగంపల్లి, నాగర్‌సోల్, ధర్మవరం, హుబ్లీ, గుంటూరు ఫాస్ట్ ప్యాసింజర్లు ప్రధానమైనవి. నిత్యం ఈ రైళ్లు ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతుంటాయి. టిక్కెట్ దొరకని వారంతా జనరల్ బోగీలను ఆశ్రయిస్తుంటారు.డిమాండ్‌కు తగినట్లుగా రైల్వే జనరల్ బోగీల సంఖ్యను పెంచడం లేదు. దీంతో ఈ బోగీలో సీటు కోసం ప్రయాణికులు నానా పాట్లు పడుతుంటారు. రైలు బయలుదేరే సమాయానికి రెండుగంటల ముందుగానే స్టేషన్‌కు వచ్చి బారులు తీరుతుంటారు. ఎక్కువ డిమాండ్ లింగంపల్లి, ధర్మవరం, హుబ్లీ ఎక్స్ ప్రెస్‌లకు ఉంటుంది. ఇటు కోనసీమ, సరిహద్దునున్న కృష్ణా ప్రయా ణికులతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు రిజర్వేషన్ దొరక్కపోతే సీటు కోసం నరసాపురం స్టేషన్‌కు వచ్చి జనరల్ బోగీలు ఎక్కుతుంటారు. దీంతో ప్రయాణీకులంతా ఈ బోగీల్లోనే ఎక్కి కిక్కిరిసిపోతారు.అదనంగా జనరల్ బోగీలు వేయాలని డిమాండ్ చేస్తున్నా..కార్యరూపం దాల్చడం లేదు.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో ఇబ్బందులు

తణుకులో విజయవాడ మీదుగా వెళ్ళే రైళ్ళన్నీ 1నెంబర్ ప్లాట్‌ఫామ్ మీదకు, విశాఖ వైపు వెళ్లె రైళ్ళు 2,3 ప్లాట్ ఫ్లామ్ మీదుగా వస్తుంటాయి. విజయవాడ మీదుగా వెళ్లే అన్నీ రైళ్లకు ముందు, వెనుక రెండు చొప్పున నాలుగు జనరల్ బోగీలు ఉంటాయి, విశాఖ ఎక్స్ ప్రెస్‌కు మాత్రం ముందు, వెనుక ఒకటి చొప్పున రెండే ఉంటాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.


ద్వారకాతిరుమల కొండపై ఉన్న శివాలయం..అలంకరణలో శివుడు

ద్వారకాతిరుమలలో మహా శివరాత్రి

23 నుంచి వచ్చేనెల 1 వరకూ ఉత్సవాలు

26 రాత్రి లింగోద్భవకాల అభిషేకం, శివయ్య కల్యాణం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల క్షేత్రపాలకుని ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. వచ్చేనెల 1 వరకూ జరుగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23 ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా చేస్తారన్నారు.ఈనెల 24న ఉదయం వేదపారాయణలు, శివయ్యకు అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి విఘ్నేశ్వరపూజ, శైవ పుణ్యహవాచన, పంచగవ్యప్రాసన, దీక్షాదారణ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్టాపన, అంకురార్పణ, మంటపార్చన, ధ్వజారోహణ, జరుగుతాయన్నారు. 25 రాత్రి స్వామివారికి గ్రామోత్సవం, 26న మహాశివరాత్రి పర్వదినాన విశేష కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా ఆరోజు ఉ.4గంటలకు స్వామివారికి అభిషేకం, అనంతరం వేదపారాయణలు, రాత్రి 10 గంటలకు లింగోద్భవకాల అభిషేకం, తర్వాత స్వామి, అమ్మవారి కల్యాణ ం, అనంతరం గ్రామోత్సవం జరుగుతాయని తెలిపారు. వచ్చే నెల 1నరాత్రి 8 గంటలకు జరుగనున్న శ్రీపుష్పయాగోత్సవంతో కల్యాణోత్సవాలు పరిసమాప్తమవుతాయని ఈవో తెలిపారు. అలాగే ప్రధాన ఆలయానికి ఉపాలయమైన ఈ ఆలయ అభివృద్ధికి పలు చర్యలు చేపట్టామని ఇందులో భాగంగా ఆలయం ముందు నూతన గాలిగోపురాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు.

భక్తులకు ఇబ్బంది కలగకూడదు

మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్ష



ఏలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ఉత్సవాలలో సామాన్య భక్తులకు సైతం ఎలాంటి సౌకర్యాల లేమి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సోమవారం పట్టిసీమ రివర్ ఇన్ అతిథి గృహంలో జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సామాన్య భక్తులకు దర్శనం కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. క్యూలైన్లు, ఫెర్రీ వద్ద వద్ద ఎలాంటి తొక్కిసలాట లేకుండా , అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలి. వైద్య శిబిరాల నిర్వహణ, 108 వాహనాల ఏర్పాట్లు, స్నానాల రేవుల వద్ద గజ ఈతగాళ్ళ ఏర్పాట్లు, చలువ పందిళ్ళు, బట్టులు మార్చుకునే గదులు, సమాచారం కోసం సీసీ కెమెరాల పర్యవేక్షణ, ఆర్టీసీ బస్సుల సర్వీసుల నిర్వహణ, పార్కింగ్ క్రమబద్ధంగా జరిగేలా చూడాలన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో వెంకటరమణ, డిప్యూటీ పంచాయతీ అధికారి అనురాధ, డీఎస్పీ వెంకటేశ్వరరావు, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ రంగారావు ఆలయ ధర్మకర్త కొచ్చర్లకోట వెంకట జగన్నాధరావు, ఆలయ కమిటీ సభ్యులు వీరభద్ర రావు, సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి, తహసీల్దారు సాయిరాజు, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వీరేశ్వరస్వామికి అభిషేకాలు

స్వామిని దర్శించుకున్న కలెక్టర్, జేసీ

పట్టిసీమ శివక్షేత్రాన్ని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సోమవారం దర్శించారు. మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల సమీక్షా సమావేశానికి వచ్చిన కలెక్టర్, జేసీ తొలుత భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈవో చాగంటి సురేష్ నాయుడు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జేసీలకు ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనంతో ఆశీర్వదించి, దుశ్శాలువలతో సత్కరించారు.

కలెక్టర్‌ను నిలదీసిన వృద్ధుడు

సమీక్షా సమావేశానికి వచ్చిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిలను పట్టిసీమ గ్రామానికి చెందిన ఒక వృద్ధుడు ఆలయ దర్శనానికి వచ్చి వారిని నిలదీయడంతో అక్కడివారు షాక్ తిన్నారు.పట్టిసీమ గ్రామానికి చెందిన రంభ రామారావు సమావేశానికి వెళ్తున్న క్రమంలో వారిని దగ్గరకు పిలిచి మీరు ఎందుకు వచ్చారు ? ఎందుకు వెళుతున్నారు ? పట్టిసీమ శివక్షేత్రానికి రాక పోకలు సాగించేందుకు వంతెన నిర్మించాలని గ్రామస్థులు ఎన్నో ఏళ్ళుగా కోరుతున్నామని నిలదీశారు. దీంతో కలెక్టర్ వంతెన నిర్మాణం ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు.

కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆ దిశగా 20న చంద్రబాబు, పవన్‌లను కలిసి వివరిస్తాం..

ప్రభుత్వం తరపున అప్పీలు కెళ్తాం

ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్

ఏలూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యేలు, కొల్లేరు ప్రజల సహకారంతో ముందడగు వేస్తామని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తెలిపారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. కొల్లేరు అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉండటం వల్ల ఆక్రమణలు కొట్టడం అనేది అధికారులు తమ పని చేసుకుంటూ వెళ్తున్నారు. అక్కడ ప్రజల మనోభావాలకు అనుగుణంగా ఈ సమస్యను తీర్చాల్సిన బాధ్యత మాపై ఉంది. సుప్రీంకోర్టు తీర్పు అమలు వల్ల హైకోర్టుకు ఈ అంశం రావడం లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కొల్లేరు సమస్యను అస్సలు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కొల్లేరుపై ఈ నెల 20న మాట్లాడటానికి రావాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్‌లతో కలిసి కూలంకషంగా పరిస్థితిని వివరిస్తాం. దీనిపై ప్రభుత్వం తరఫున లాయర్‌ను పెట్టి అప్పీలుకు వెళ్లి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మహేశ్ స్పష్టం చేశారు. మొదట ప్రజల తరఫున పిటిషన్ వేయాలని భావించాం. న్యాయ నిపుణుల సలహా మేరకు ప్రభుత్వమే పిటిషన్ దాఖలు చేస్తుంది. అదే విధంగా మరోసారి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతాం' అని వివరించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించి తీరుతామని, దీనిపై ప్రచారం జోరుగా సాగుతోందని ఎంపీ మహేశ్‌కుమార్ వివరించారు.



పదో రాష్ట్రస్థాయి జూనియర్ నెట్ బాల్ విజేతగా నిలిచిన పశ్చిమ గోదావరి జిల్లా జట్టు

రాష్ట్ర స్థాయి బాలికల నెట్ బాల్ పోటీల విజేత పశ్చిమ జట్టు

పాలకోడేరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలోని డాన్ బాస్కో హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగిన 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ అండర్ -19 బాలబాలికల నెట్ బాల్ పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచిందని, బాలురు జట్టు తృతీయ స్థానాన్ని సాధించిందని, జిల్లా నెట్ బాల్ సంఘ కార్యదర్శి ఎన్.విజయలక్ష్మి తెలిపారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూర్పు గోదావరి జిల్లా నెట్ బాల్ సంఘ అధ్యక్షులు కె.అశోక్‌రెడ్డి, డాన్ బాస్కో హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ బల్కదర్ విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. బాలురులో ప్రథమ స్థానం తూర్పు గోదావరి జిల్లా, ద్వితీయస్థానం విశాఖ జిల్లా, తృతీయస్థానం పశ్చిమ గోదావరి జిల్లా జట్లు నిలిచాయి. బాలికల్లో పశ్చిమ గోదావరి ప్రథమస్థానం వైఎస్ఆర్ కడప జిల్లా , ద్వితీయ స్థానం విశాఖ జిల్లా జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెలలో జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ నెట్ బాల్ పోటీల్లో ఆంధ్ర ప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని కోచ్ పి.దావూద్ ఖాన్ తెలిపారు. ఈ నెట్ బాల్ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులను పశ్చిమ గోదావరి జిల్లా నెట్ బాల్ సంఘ సభ్యులు పి.దావూద్ ఖాన్, వి.వినీత్, జి.విజయ్‌కుమార్, సుధీర్, రామకృష్ణ, శ్రీనువాసు, వెంకటేష్, నవ్య, దానియేలు, అక్షయ్‌లు అభినందించారు.

పాస్టర్లంతా ఐక్యంగా ఉండాలి : జీవన్ కుమార్

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : పాస్టర్లు ఐక్యంగా ఉంటే ప్రభుత్వం నుంచి చట్టపరంగా క్రైస్తవులకు రావల్సిన వాటన్నింటిని సాధించు కోవచ్చని అంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఫౌండర్, జనరల్ సెక్రటరీ రెవరెండ్ జీవన్ కుమార్ అన్నారు. డీసీఎంఎస్ పంక్షన్ హాల్లో స్టేట్ పాస్టర్స్ కాన్ఫరెన్స్ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బిందుపల్లి శామ్యూల్ ఆనంద్ కుమార్, పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బ్రదర్ కె.ప్రభాకరరావు, ఐడీఎంసీ ఛైర్మన్ రెవరెండ్ పాల్ జయచంద్రన్ పాల్గొని మాట్లాడుతూ పాస్టర్లు ఐక్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ వ్యాపారవేత్త రామవయ్య చౌదరిని ఘనంగా సన్మానించారు.

సహకారం.. సరికొత్తగా..



ఒకేపంట పండించే వారితో ఎఫ్‌పీవో గ్రూపులు

పంటల సామర్థ్యం పెంచే దిశగా అడుగులు

ఉమ్మడి డీసీసీబీ పరిధిలో 19 సొసైటీలు అంగీకారం

ఏలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సహకారం రంగాన్ని మరింత పరిపుష్టం చేసే దిశగా కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారు నడుం బిగించింది. వ్యవసాయ రంగం, అనుబంధ రంగాల్లోని రైతులను ఒకేతాటిపై తీసువచ్చి వారి పెట్టుబడి, ఉత్పత్తి, మార్కె టింగ్ సదుపాయాల కోసం ఐక్యంగా అడుగులు వేసే దిశగా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీవో)లకు అంకురార్పణ చేసింది. దేశవ్యాప్తంగా 10 వేల ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేయా లన్నది లక్ష్యంగా రాష్ట్రంలో 170 పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో) ఈ రకంగా గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని ఆప్కాబ్ నిర్ణయించింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో పరిధిలోని కేంద్ర సహకార కేంద్రబ్యాంకు 19 సొసైటీల్లో ఎఫ్‌పీవోల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా దీనికి అన్ని సొసైటీలు అంగీకారం తెలిపాయి. ఏలూరు జిల్లాలోని దెందులూరులోని గంగన్నగూడెం, నిడమర్రు మండలంలో చిననింద్రకొలను, పోలవరం మండలంలో గూటాల, పెదపాడు మండలంలో గోగుంట సొసైటీలను ఎంపిక చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో అత్తిలి మండలంలో పాలూరు, ఇరగవరం మండలంలో రేలంగి, కాళ్ల మండలంలో కాళ్లకూరు, పెనుమంట్ర మండలంలో మామిడూరు, తణుకు మండలంలో దువ్వ, ఉండి మండలంలో యండగండి, యలమంచిలి మండలంలో యలమంచిలి, ఆకివీడు మండలంలో చెరుకుమిల్లి, భీమవరం మండలంలో వెంప, మొగల్తూరు మండలంలో మొగల్తూరు, పాలకొల్లు మండలంలో లంకలకోడేరు, పెంటపాడులో ముదునూరు, పోడూరులో జిన్నూరు, వీరవాసరం మండలంలో వీరవాసరం సొసైటీలు ఎంపికయ్యాయి.

ఎఫ్‌పీవోలు ఉద్దేశం ఏమిటంటే ?

వ్యవసాయంతో పాటు ఉద్యానవనాలు, పండ్లతోటలు, ఇతర ప్రాసెస్ యూనిట్లను నెలకొల్పుకుని ఐక్యంగా రైతులు నడిపించుకోవడానికి ఎఫ్‌పీవో గ్రూప్ ఉపయుక్తంగా ఉంటుంది. ఇందులో ఎంపిక చేసిన సొసైటీల పరిధిలో ఒకేరకమైన పంట పండించే రైతులంతా 200 మందికి తక్కువ కాకుండా ఎఫ్‌పీవోగా నమోదు కావాల్సి ఉంటుంది. విత్తన ఉత్పత్తి, ప్లాంటేషన్, హార్టికల్చర్, అగ్రి ఫారెస్ట్రీ, టిష్యూ కల్చర్ , ఆగ్రో సర్వీస్, గ్రీన్‌హౌస్, పాలీహౌస్ తదితర రంగాల్లోని రైతులకు ఇది మెరుగైన ఫలితాలను ఇవ్వ నుంది. ఆప్కాబ్ పర్యవేక్షణలో నాబార్డు, ఎన్‌సీడీసీ (ఐసీడీపీ పథకం)లు ఈ రెండు సంయుక్తంగా ఈ గ్రూపులకు ఆర్థిక సాయం అందజేస్తాయి. ఆర్థికంగా, సాంకేతికంగా రైతులకు అవస రమైన సహకారం అందించి వారి ఉత్పత్తులను పెంచే దిశగా అడుగులు వేయనున్నాయి. ఐక్య గ్రూపుల వల్ల ఉత్పత్తుల పరస్పర సేకరణ, ఆదాయం పెంపు, వ్యవసాయరంగం మరింత పురోభివృద్ధి సాధించడానికి వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. ఎఫ్‌పీవోల నిర్వహణకు ప్రతీ ఏటా రూ.6 లక్షల నిర్వహణ వ్యయం కూడా అందిస్తారు. ఇలా మూడేళ్ల వరకు ఒక్కో ఎఫ్‌పీవోపై రూ.18 లక్షల సాయం అందుతుంది.

పర్యవేక్షణకు జిల్లా టీమ్

ఆప్కాబ్, నాబార్డు, ఎన్‌సీడీసీల ఆధ్వర్యంలో జిల్లాలో ఎఫ్‌పీవోలు నిర్వహణపై పర్యవేక్షణకు జిల్లాలో డీసీవో, డీసీబీబీ సీఈవో, డీడీఎం, డీపీడీఎం, అగ్రికల్చర్, పశుసంవర్థకశాఖ జేడీలు, ఫిషరీస్, హార్టికల్చర్ జిల్లా అధికారులు పనిచేస్తారు.

రైతులకు ఎంతో మేలు : డీసీసీబీ సీఈవో తిలక్

ఒకేపంటను పండించే రైతులను ఒక గొడుగు కింద తీసుకువచ్చి వారి సామర్థ్యాలను మెరుగుపర్చి వారి ఉత్పత్తులకు గణనీయంగా రేటు సాధించుకోవడానికి ఎఫ్‌పీవో వ్యవస్థ ఉపయోగపడుతుంది. జిల్లాలో ఉద్యానపంటలు, పండ్లతోటలు,ఇతర ప్రాసెస్ యూనిట్లకు ఇది మేలు చేసుందని ఆశిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో 19 సొసైటీలను ఆప్కాబ్ ఎంపిక చేసింది. ఆయా సొసైటీల్లోని రైతులకు వివరించి వారిని గ్రూప్ ఆఫ్ ఫార్మర్స్‌గా త్వరలో ఏర్పాటు చేస్తాం.


అదనపు ఈవోకు డీడీ అందజేస్తున్న వెంకటరమణ

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం

తిరుమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ20 లక్షలు విరాళంగా అందాయి. భీమవరానికి చెందిన వెంకటరమణ రూ.10 లక్షలు, తిరుపతికి చెందిన సాధు పృథ్వీ రూ.10 లక్షలు చొప్పున విరాళం డీడీలను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

'ఇగ్నో' ప్రవేశాలకు 28తో ముగియనున్న గడువు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) :ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో వివిధ దూరవిద్య, ఆన్‌లైన్ సర్టిఫికెట్, డిప్లమో, పీజీ డిప్లమో, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 28లోగా యూనివర్సిటీ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసు కోవాలని సీఆర్ ఆర్ కళాశాల 'ఇగ్నో' స్టడీసెంటర్ కో-ఆర్డినేటర్ రామరాజు తెలిపారు.

భర్త, అత్తమామల నుంచి రక్షణ కల్పించండి


ఎస్పీ కార్యాలయం వద్ద కుమార్తెలతో దివ్య

పెదపాడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం భర్త నుంచి విడిపోయి దివ్యాంగులైన (మూగ, చెవుడు) ఇద్దరు ఆడపిల్లలతో పెదపాడు మండలం ఏపూరు గ్రామంలో జీవనం ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, కొద్దిరోజులుగా భర్త గెద్దల హరికృష్ణ అత్త, మామతో పాటుగా బంధువులు వేధింపులకు గురిస్తున్నారని వారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ దివ్య జిల్లా ఎస్పీకి సోమవారం వినతిపత్రం అందజేసింది. భర్త నుంచి విడిపోయిన దివ్య దివ్యాంగులైన (శ్రీవిద్య, వర్షిణి) పిల్లలతో జీవనం సాగిస్తోంది. ఇటీవల వీరికి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.6 వేలు చొప్పున పెన్షన్ మంజూరు చేసింది. విషయం తెలిసిన భర్త హరికృష్ణతో పాటు అత్త, మామ, తోడకోడళ్లు అంతా కలిసి ఈనెల 9వ తేదీన ఇంటి మీదకు వచ్చి పెన్షన్ డబ్బుల కోసం పిల్లలను బలవంతంగా తీసుకు వెళ్లేం దుకు ప్రయత్నించారని తెలిపింది. పిల్లలకు వచ్చే పెన్షన్ కోసం భర్తతో పాటు బంధువులు దాడికి దిగుతున్నారని, వారి వల్ల ప్రాణహాని ఉందంటూ భర్తతో కలిపి మొత్తం ఏడుగురిపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి ఎస్సై కట్టా శారద సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఒక ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులు కొంత బంగారం, నగదును దుర్వినియోగం చేయడంతో ఆ ముగ్గురిపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి చీటింగ్ కేసు నమోదైంది. ఏలూరు ఆర్ఆర్ పేటలో ఉన్న ముత్తూట్ మినీ ఫైనాన్స్ కంపెనీకి బ్రాంచ్ మేనేజర్‌గా పడగల ఆనందశామ్యూల్ చేస్తున్నారు. ఆయన, మరో ఇద్దరు కలిసి ఆ ఫైనాన్స్ కంపెనీలకు చెందిన 135 గ్రాముల బంగారం, కొంత నగదు దుర్వినియోగం చేశారు. ఈ విషయాన్ని గమనించిన ఆ సంస్థ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. నిర్ధారణ కావడంతో ముత్తూట్ మినీ ఫైనాన్స్ కంపెనీ రీజనల్ మేనేజర్ వేల్పూరి రాజేష్ సోమవారం రాత్రి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్ మేనేజర్ ఆనందశామ్యూల్‌తో పాటు మరో ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



స్కూల్లో తాచుపాము

పట్టివేసిన స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు క్రాంతి

ఏలూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఏలూరు రోడ్డులో ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో సోమవారం తాచుపాము కలకలం రేపింది.. పాఠశాల సిబ్బంది పామును గమనించి స్నేక్ సేవియర్ సొసైటీకి సమాచారమందించారు. స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి స్కూల్‌కు వచ్చి చెట్టు మొదట్లో స్థావరం ఏర్పాటు చేసుకుని ఉన్న ఏడడుగుల గోధుమ తాచు పామును చాకచక్యంగా పట్టుకున్నారు. దీంతో స్కూల్లోనివారంతా ఊపిరి పీల్చుకున్నారు. పామును అడవిలో వదిలిపెడతానని క్రాంతి తెలిపారు.


సముద్ర తీరంలో ఉన్న మోటార్ సైకిల్

'నేను చనిపోలేదు బతికే ఉన్నా'

మొగల్తూరు/కొవ్వూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): 'ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టపోయి అప్పులపాలయ్యా. వాటిని తీర్చే దారిలేదు. ఇక బతకలేను. తమ్ముడు, పిల్లలు జాగ్రత్త. నేను ఆత్మహత్య చేసుకుంటున్నా' అంటూ పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో ఓ యువకుడు ఆదివారం సెల్ఫీ వీడియో తీసి మిత్రులకు షేర్ చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కొవ్వూరు రూరల్ మండలం వాడపల్లి బంగారుపేటకు చెందిన యర్రంశెట్టి సతీష్‌గా గుర్తించారు. ఆదివారం బైక్‌పై బీచ్‌కు వచ్చి ఈ వీడియో చేసి మిత్రులకు పంపించాడు. వారు సతీష్ సోదరుడు భార్గవ్‌రామ్‌తో కలిసి మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఏఎస్ఐ బండి సత్యనారాయణ మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయానికి తీరంలో సతీష్ బైక్, సెల్‌ఫోన్ లభ్యమయ్యాయి. ఇక్కడే సముద్రంలో దిగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని స్నేహితులు, కుటుంబ సభ్యులు ఇక్కడ గాలించారు. సోమవారం సాయంత్రానికి నెల్లూరు నుంచి సతీష్ తన భార్యకు ఫోన్ చేసి 'నేను చనిపోలేదు. బతికేవున్నా' అని తెలియజేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

గోస్తనీ కాలువలో దూకిన మహిళ

తణుకు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణ పరిధిలోని సజ్జాపురానికి చెందిన మహిళ బైపాస్ రోడ్డులోని గోస్తనీ కాలువలోకి దూకి గల్లంతైంది. సోమవారం తెల్లవారు జామున గమ్మళ్ళ శాంతి(48) వంతెన వద్ద చెప్పులు వదిలింది. దీంతో కాల్వలోనే దూకి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.పట్టణ ఎస్సై కె.శ్రీనివాసు కేసు నమోదు చేసి మహిళ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఐ కొండయ్యతో ఫోన్‌లో మాట్లాడి గాలింపు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

బాక్సులు సిద్ధం

ఏలూరు చేరిన ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులు - జిల్లాలకు తరలింపు

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ బాక్సులు తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 27వ తేదీన నిర్వహించే ఎన్నికల నిమిత్తం వివిధ జిల్లాలలోని డివిజన్ కేంద్రాలకు ఈ బ్యాలెట్ బాక్సులను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నుంచే తరలిస్తున్నారు. సోమవారం ఆయా ప్రాంతాలకు ఈ బ్యాలెట్ బాక్సులను జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి తరలించారు. భీమవరం ఆర్డీఓ కార్యాలయానికి 259 బ్యాలెట్ బాక్సులు, రాజమండ్రి ఆర్డీవో కార్యాలయానికి 120 బ్యాలెట్ బాక్సులు, గుంటూరు, కృష్ణా పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి నూజివీడు ఆర్డీవో కార్యాలయానికి 80బ్యాలెట్ బాక్సులు తరలించినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సమయానికి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు ఆ బ్యాలెట్ బాక్సులను, పోలింగ్ సామాగ్రితో కలిసి తరలించినట్టు తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి బ్యాలెట్ బాక్సులను ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం తరలిస్తున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ సిఈఓ కెఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. మొత్తం మీద పరిశీలిస్తే ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



జాబితా ప్రకారం ఆయా జిల్లాలకు బాక్సులు తరలిస్తున్న అధికారులు

పాత కక్షలతో ఇరు వర్గాల ఘర్షణ

ఎనిమిది మందికి తీవ్ర గాయాలు


ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పాతకక్షలు నేపథ్యంలో రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో అటు నలుగురు, ఇటు నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈసంఘటనపై రెండు వైపులా ఫిర్యాదుల అందడంతో ఏలూరు రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలోని గురుకుల పేటలో అధికార పార్టీ నాయకుడు గుర్రం తాతారావుకు, ఆ గ్రామ ఎంపీటీసీ అయిన గండికోట నాగరాజు మధ్య గొడవలు ఉన్నాయి. నాగరాజు గతంలో వైసీపీ కాగా ప్రస్తుతం టీడీపీలో చేరారు. అయినప్పటికీ వీరంతా ఒకే పార్టీ అయినా పాత కక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం ఉపాధి పనికి వెళ్ళి తిరిగి వస్తుండగా ఒకరిపై ఒకరు తమ్మిలేరు ఏటిగట్టు వద్ద కర్రలతో దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో గుర్రం తాతారావు కుటుంబానికి చెందిన రాజు, శివాజీ, రమణమ్మ, రాజేశ్వరులు తీవ్రంగా గాయపడ్డారు. మరో వర్గానికి చెందిన వారైన గండికోట నాగరాజు, గుర్రం వెంకటేశ్వరరావు, గుర్రం తిరుపతి వెంకన్న, వీరబాబు గాయపడ్డారు. క్షతగాత్రులు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. దాడి సమాచారం తెలుసుకున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వచ్చి ఇరువురిని పరామర్శించారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి. సత్యనారాయణ, వన్‌టౌన్ ఎస్ఐ నాగబాబు, ఏలూరు రూరల్ ఎస్ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ వారి సిబ్బంది ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు గురకలపేట వద్ద స్పెషల్ పార్టీ పోలీసులతో పికెట్‌ను ఏర్పాటు చేశారు.

లారీ ఢీకొని విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్ ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొని విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన మండలంలోని పెదతాడేపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి శివారు ముత్యాలంబపురం గ్రామానికి చెందిన పప్పు సంజీవరావు (64) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన దేవరపల్లిలోని తన పొలం పనులు చూసుకుని తిరిగి మోటార్ సైకిల్‌పై వస్తుండగా పెదతాడేపల్లి వద్ద లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంజీవరావు తీవ్రంగా గాయపడటంతో 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

విచారణపై రైతుల్లో అసహనం

నిడమర్రు లంచం కేసును అధికారులు తప్పుదారి పట్టిస్తున్నారంటూ ఆరోపణలు

నిడమర్రు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):నిడమర్రు మండలం వెంకటాపురం జిరాయితీ భూముల సాగు విషయమై 'లంచం ఇస్తేనే సాగు' అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా ఫారెస్టు అధికారి బి.విజయ విచారణకు ఆదేశించిన సంగతి విదితమే. ఏలూరు ఫారెస్టు రేంజ్ అధికారి విజయలక్ష్మిని విచారణాధికారిగా కూడా నియమించారు. ఇదిలా ఉంటే అధికారికి ఈ విచారణ అనుకూలంగా సాగుతోందనే వాదనలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. తమ నుంచి ఎలాంటి వివరణ కోరకుండా కేసు విచారణ పూర్తయిందని తెలియజేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. తమ వద్దకు వచ్చి అధికారులు విచారణ చేస్తారని అంతా భావించామని అన్నారు. ఎవ్వరూ రాకపోగా విచారణ పూర్తియినట్టు తేల్చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు సంబంధం లేని భీమడోలు మండలం చెట్టున్నపాడు చెరువుల గురించి విచారణలో పేర్కొనడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. విచారణను తప్పుదోవ పట్టించడానికే అటవీ శాఖ అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచారణ చేసినట్టు పత్రాల్లో పేర్కొన్న చెట్టున్నపాడు చెరువుతో తమకు ఎలాంటి సంబంధం లేదని, విచారణకు హాజరు కావాలని ఎలాంటి నోటీసులూ అందలేదని పేర్కొన్నారు. దీనిపై ఏలూరు ఫారెస్టు అధికారి విజయలక్ష్మిని వివరణ కోరగా నోటీసులు అందజేసినట్టు పేర్కొన్నారు. 15వ తేదీన హాజరు కాలేదని, లిఖితపూర్వకంగా రాయమని అడిగితే పంపడం కుదరలేదని రైతు నుంచి సమాధానం వచ్చినట్టు తెలిపారు. ఈ విషయమై 18న ఏలూరు లేదా నిడమర్రులో విచారణ చేపడతామని వివరణ ఇచ్చారు.


విచారణ కోసం ఎదురుచూస్తున్న రైతులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలివే..

మండలాల వారీగా వివరాలను వెల్లడించిన అధికారులు

ఏలూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : తూర్పు - పశ్చిమ గోదావరి జిల్లా పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు జరగనున్నాయి. దీనికి సంబంధించి ఏలూరు జిల్లాలో 66 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లా పరిధిలో మొత్తం 42,282 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 24,704, మహిళా ఓటర్లు 17,571 మంది, ట్రాన్స్ జెండర్లు ఏడుగురు ఉన్నారు. తాజాగా ఆయా మండలా ల్లో ఓటర్లను బట్టి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

కేంద్రాలివే.. కుక్కునూరు జడ్పీ పాఠశాలలో, వేలేరుపాడు మండలానికి జడ్పీ హైస్కూల్, జీలుగుమిల్లిలో ఒకటి , బుట్టాయగూడెం జడ్పీ హైస్కూల్లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలవరంలో గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో రెండు, కొయ్యలగూడెంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు, జంగారెడ్డిగూడెంలో జెడ్పీ హైస్కూల్లో 4, జంగారెడ్డిగూడెం మండలానికి గద్దే లక్ష్మీనరసమ్మ జడ్పీ బాలికల పాఠశాలలో 3 కేంద్రాలు, టి.నర్సాపురంలో జడ్పీ హైస్కూల్‌లో రెండు కేంద్రాలు ఉన్నాయి. చింతలపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడు, ప్రభుత్వ హైస్కూల్లో ఒకటి, లింగపాలెం జడ్పీ హైస్కూల్లో రెండు, కామవ రపుకోట జడ్పీ హైస్కూల్లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. ద్వారకాతిరుమల మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో రెండు, ద్వారకాతిరుమల ఎంపీపీ స్కూల్లో ఒకటి, ఉంగుటూరు కమ్యూనిటీ హాల్లో ఒకటి, భీమడోలు ఎంపీపీ పాఠశాలలో రెండు, భీమడోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఒకటి, పెదవేగి జడ్పీ హైస్కూల్లో రెండు, పెదవేగి ఎంపీపీ స్కూల్లో రెండు, పెదపాడు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రెండు, పెదపాడు ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాలలో ఒకటి, ఏలూరు గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 4, ఏలూరు కోట దిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగు, ఏలూరు రూరల్ గుడివాకలంక ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాలలో ఒకటి, అశోక్‌నగర్‌లో ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాలలో రెండు, సెయింట్ జేవియర్ ప్రైమరీ స్కూల్లో 3, లక్ష్మివారపుపేట ఎఆర్‌డీజికే మున్సిపల్ హైస్కూల్లో 4, దెందులూరు గారపాటి హైమావతిదేవి జడ్పీ హైస్కూల్లో రెండు, దెందులూరు ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్లో ఒకటి, నిడమర్రు ఎస్‌జీజీకేఆర్ జెడ్పీహైస్కూల్‌లో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

వెలగలేరులో భారీ చోరీ

23 కాసుల బంగారం - 1.80 లక్షల నగదు చోరీ


చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

పెనుమంట్ర, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : వారం రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి కూతురు వద్దకు వైజాగ్ వెళ్లిన ఒకరి ఇంటిని దొంగలు లూటీ చేశారు. ఈ విషయం వైజాగ్‌లో ఉన్న యజమానులకు స్థానిక బంధువులు సమాచారం అందించారు. దీంతో పడాల సూర్యకుమారి ఇంటికి వచ్చి పరిశీలించగా బంగారం, నగదు దొంగలు దోచుకుపోయాయని పోలీసులను ఆశ్రయించారు. పెనుమంట్ర మండలం వెలగలేరు శివాలయం సమీపంలో ఆదివారం రాత్రి తలుపులు పగలగొట్టి బీరువాలోని ఇరవై మూడున్నర కాసుల బంగారం ఆభరణాలు, లక్ష 80 వేల నగదు అపహరణకు గురైనట్టు రిటైర్డు జవాన్ పడాల విజయ్ కుమార్ రెడ్డి భార్య సూర్య కుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీం డాగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. ఇంటిలో ఉన్న సీసీ ఫుటేజ్ ను పరిశీలించగా అర్ధరాత్రి ఒంటిగంట నర సమయంలో చోరీ జరిగిందని పోలీసు లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెనుమంట్ర ఎస్సై టి.స్వామి తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు : ఎంపీడీవో

టి.నరసాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి గ్రామాల్లో ఎవరైనా కోడి మాంసం, గుడ్లు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో మణికుమారి హెచ్చరించారు. టి.నరసాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాంసం విక్రయదారులకు పంచాయతీ సిబ్బంది నోటీసులు ఇచ్చామని, గ్రామాల్లో మైక్‌ల ద్వారా బర్డ్ ఫ్లూ, జీబీఎస్ వ్యాధుల గురించి అవగాహన కల్పించినట్టు తెలిపారు.

ఇళ్ల లబ్ధిదారులకు రుణాలు కేటాయిస్తాం : ఎమ్మెల్యే

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : అర్హులైన లబ్ధిదారులకు సొంత గృహాల కేటాయింపునకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన వారిలో ఎక్కువ మంది ఇళ్లు నిర్మించాలని, స్థలాలు ఇవ్వాలని నూతన పింఛన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఎవ్వరూ ఆధైర్యపడొద్దని నూతన పింఛన్లు మంజూరు చేయిస్తామన్నారు. సాధ్యమైనంత త్వరగా పేదలకు ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

'సెల్ట్' శిక్షణలో ఉపాధ్యాయుడు దాస్‌కు పురస్కారం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ళ ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు కంకర్ల దాస్ ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. కేరళ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు జనవరి 16 నుంచి ఈ నెల 14 వరకు బెంగళూరులోని రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సౌత్ ఇండియా(రిసి)లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్(సెల్ట్) కోర్సు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో దాస్ ఉత్తమ పనితీరు కనబర్చడంతో పురస్కారానికి ఎంపికయ్యారని ఎంఈవోలు రవిప్రకాష్, రమణ తెలిపారు. పురస్కార గ్రహీతను స్కూలు హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు ఆదినారాయణ, సుబ్రహ్మణ్యం అభినందించారు.

క్యాన్సర్ ఆసుపత్రికి అంబులెన్స్ బహూకరణ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంగాయిగూడెం గుడ్ సమరటీన్ క్యాన్సర్ ఆసుపత్రికి అంబులెన్స్‌ను అందజేశారు. వైఎంహెచ్‌ఏలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ మడుపల్లి మోహన్ గుప్తా చేతుల మీదుగా అంబులెన్స్ తాళాలను క్యాన్సర్ ఆసుపత్రి ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ బి.వి సుబ్బారావు, వేమా కోటేశ్వరరావు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

18 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

పెదపాడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఉత్తర్వుల మేరకు 0-6 సంవత్సరాల లోపు పిల్లలకు కొత్త ఆధార్ కార్డులు నమోదుకు ఈ నెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు, 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆధార్ మొబైల్ క్యాంపులను మండలంలో ఏర్పాటు చేయనున్నట్టు ఎంపీడీవో అమీల్ జమ తెలిపారు. 18,19 తేదీల్లో కలపర్రు, కొత్తముప్పర్రు, 20,21న పెదపాడు, కొక్కిరపాడు, 24, 25వ తేదీల్లో అప్పనవీడు, వట్లూరులో, 27న ఏపూరు, తోటగూడెం, 28న ఏపూరు, వసంతవాడ గ్రామాల్లో క్యాంపులు జరుగుతాయని ఎంపీడీవో అమీలు జమ తెలిపారు.

విజయవాడలో మీటర్ రీడర్స్ యూనియన్ సభ

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహా సభ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనుంది. ఈ మేరకు ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, యూనియన్ కోశాధికారి మల్లేశ్వరరావుల ఆధ్వర్యంలో సోమవారం స్ఫూర్తి భవన్‌లో పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీల్లో జరిగే ఈ సభల్లో పలు అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. స్మార్ట్ మీటర్ల కారణంగా రీడర్స్ ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ మహాసభలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ఏలూరు నగర అధ్యక్షులు కె.శ్రీధరరావు, కె.మురళీబాబు, ఆర్.అప్పలస్వామి, ఎం.సూరిబాబు, ఆర్.విఠల్ కుమార్ పాల్గొన్నారు.

క్లస్టర్ సమావేశాల్లో సమతుల్యత పాటించాలి

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : టీచర్ల బోధనకు అంతరాయం కలగకుండా క్లస్టర్ల సమావేశాల సమయాలను సమతుల్యం చేయాలని అభ్యర్థిస్తూ సోమవారం డీఈవో వెంకటలక్ష్మమ్మకు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్)జిల్లా గౌరవాధ్యక్షుడు నెరుసు రాంబాబు వినతిపత్రాన్ని అందజేశారు. క్లస్టర్ సమావేశాలను సాయంత్రం 4గంటల్లోగా ముగించేలా కుదించాలని కోరారు. వేసవి ఉష్ణోగ్రతలను పరిగణనలోకి తీసుకుని మార్చి నెలలో 15న నిర్వహించనున్న క్లస్టర్ సమావేశం వేళలను ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకే నిర్వహించి, ఆ రోజున విద్యార్థులకు పూర్తిగా సెలవు ఇస్తే ఉపాధ్యాయులంతా సమగ్రంగా సమావేశంలో పాల్గొనేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ ప్రతిపాదనలు, సూచనలను ప్రభుత్వానికి పంపిస్తామని డీఈవో హామీ ఇచ్చారు.

వై.వి.రావు సేవలు చిరస్మరణీయం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీలో కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడిన వై.వి.రావు సేవలను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ పీటీడీ ఏలూరు రీజియన్ చైర్మన్ కె.వి.రాఘవులు పేర్కొన్నారు. వై.వి.రావు ద్వితీయ వర్ధంతిని సోమవారం స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కపర్థి భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ కె.రమేష్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావులు వై.వి.రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.రాంబాబు, జి.భాస్కరరావు, డి.ఆంజనేయులు, జె.ఎస్.నారాయణ, వి.వి.కుమార్, వై.ఎస్.భాస్కర్, జి.రాంబాబు, స్వామి, బి.వి.రావు పాల్గొన్నారు.

'పేదల పక్షాన రాజు పోరాటాలు మరువలేనివి'

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన వర్గాల పక్షాన రంపాల రాజు చేసిన పోరాటాలు మరువలేనివని న్యూడెమోక్రసీ నాయకుడు ధర్మాల సురేష్ అన్నారు. సోమవారం రంపాల రాజు సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. అన్యాక్రాంతమైన భూమి కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన చరిత్ర రాజుదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.రామ్మోహన్, కారం రాఘవ, టి.బాబురావు, ఈ.భూషణం, భాషా శ్యాంబాబు, తెల్లం రామకృష్ణ, వి.వెంకటేశ్వరావు, యు.ఏసుబాబు, అచ్యుత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్చి 6న విజయవాడలో నిరసన

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ శాఖలోని అవుట్ సోర్సింగ్ కాంటాక్టు ఉద్యోగ కార్మికుల బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడాన్ని నిరసిస్తూ మార్చి 6న విజయవాడలో ఆందోళనలు చేపట్టనున్నారు. యూనియన్ అధ్యక్షులు యలగాడ దుర్గారావు అధ్యక్షతన స్థానిక స్ఫూర్తి భవనంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేటు వ్యక్తుల చేతికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అప్పగించడం సరికాదని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్యాస్ బండ పేలి ఓ వ్యక్తి ఆస్పత్రి పాలు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి, 17(ఆంధ్రజ్యోతి) : గ్యాస్ బండ పేలి ఓ వ్యక్తి ఆస్పత్రిపాలైన ఘటన మండలంలో కనకాపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన, చిర్రా బంగారయ్య 63 ఇంటి వద్ద వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ బండ పేలి మంటలు వ్యాపించాయి. దీంతో గాయాలపాలైన అతడ్ని 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై నవీన్ కుమార్ మంటలను అదుపుచేశారు.

కూచింపూడిలో చివరి అంకానికి చేరిన జాతర

పెదవేగి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం కూచింపూడిలో జాతర చివరి అంకానికి చేరుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గణాచారులు గ్రామంలో జోలెపట్టి ఇంటింటికి తిరిగి, పసుపు, కుంకుమలు సేకరించి, సోమవారం సాయంత్రం వసంతోత్సవం నిర్వహించారు. 12రోజుల పాటు పూజలు నిర్వహించి, గ్రామంలో ఉండే మారెమ్మ తల్లిని వెలగలమ్మ చెరువు గట్టుపై నిలబెట్టారు. వారంరోజులుగా జాతరకు సంబంధించిన ప్రత్యేక పూజలు జరుపుతున్నారు. కాగా గత డిసెంబరు 8వ తేదీ నుంచి గ్రామంలో ఎటువంటి శుభకార్యాలు, పండుగలు నిర్వహించలేదు. ఈ నెల 23వ తేదీతో జారత ముగుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



నగరంలోని తంగెళ్లమూడి సమాధుల తోట వద్ద డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త



ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు

దోమల దండయాత్ర

నగరంలో విజృంభణ - బెంబేలెత్తుతున్న ప్రజలు - నివారణా చర్యలు శూన్యం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : నగరంలో దోమలు విజృంభిస్తున్నాయి. ఈ దోమల దండు నగరాన్ని చుట్టుముట్టి నగరాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా నగరంలో దోమల బెడద ఉందంటే అతిశయోక్తికాదు. ఒక ఏరియా ఒక ప్రాంతమని కాదు నగరం నలుమూలల దోమలు మనుషులను చుట్టుముడుతున్నాయి. మిగిలిన గ్రామాల్లోనే కాదు నగరం నడిబొడ్డున కూడా దోమలు బెంబెలెత్తిస్తున్నాయి. దోమల వలన ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు దోమల తాకిడికి తట్టుకోలేక ఆసుపత్రుల పాలవుతున్నారు. ఒక పక్క బర్డ్‌ఫ్లూ, మరోపక్క జీబీఎస్ వ్యాధితో ప్రజలు ఆందోళన చెందుతుంటే వీటికి తోడు దోమలతో ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. డ్రైన్‌లలో మురుగునీటి పారుదల లేకపోవడం, ముఖ్యంగా హోటళ్ళు, కమర్షియల్ కాంప్లెక్సులు, అపార్ట్‌మెంట్ల యాజమానులను డ్రైన్లను శుభ్రం చేయకపోవడంతో దోమలు అధిక సంఖ్యలో విజృంభిస్తున్నాయి. మిగిలిన గ్రామాల్లో ఇళ్ళమధ్యలో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు నీరు నిల్వ ఉండటం వలన దోమలు వ్యాప్తిం చెందుతున్నాయి. మున్సిపల్ సిబ్బంది ఏరోజు చెత్త ఆ రోజు ఎత్తకపోవడంతో కుళ్ళిపోయి దోమలు ప్రభలుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నగరపాలక సిబ్బంది దోమల నిర్మూలనకు చేపట్టిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నిర్మూలనకు పగటిపూట స్ప్రేయింగ్ కానీ, దోమల లార్వా పెరగకుండా నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేయడం కాని రాత్రి వేళల్లో ఎక్కడ ఫాగింగ్ చేయడం కానీ మేము చూడ లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం..

నగరంలో దోమల నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి రోజు దోమల నిర్మూలనకు 50 డివిజన్లలో దోమల మందు స్ప్రేయింగ్ చేయిస్తున్నాం. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. రోజుకు పది డివిజన్స్‌లో రాత్రివేళల్లో ఫాగింగ్ చేస్తున్నాం.

వేణుగోపాల్ స్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పారిశుధ్య కార్మికుల కొరత...

నగరంలో పారిశుధ్య కార్మికులు సుమారు 600మంది ఉంటే వీరిలో 150మంది పారిశుధ్య కార్మికులు నగరపాలక సంస్థ కార్యాలయంలో, ప్రజా ప్రతినిధుల ఇళ్ళలో పని చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వారందర్ని పారిశుధ్య కార్మికులుగా తిరిగి తీసుకురావాలని మరింత మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసిన దోమలు లేని నగరంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుకుంటున్నారు. గత కొన్నిరోజుల క్రితం వరకు నగరంలో చెత్తను ఎత్తి డంపింగ్ యార్డుకు తరలించడానికి 60 క్లాప్ ఆటోలను వినియోగించేవారు. ఇప్పుడు ఆ ఆటోలను ఏజెన్సీ వారు ఉపసంహరించుకుంది. దీంతో నగరపాలక సంస్థ సిబ్బంది మూలనపడేసిన పుష్ కార్టులు, ట్రాక్టర్లు, కంపెక్టర్లను వాడుతున్నారు. దీంతో సరిగా చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తివేయడంలో కార్మికులు విఫలమవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య నగరంగా తీర్చిదిద్ది దోమల రహిత నగరంగా చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రాజశేఖరం గెలుపు కోసం..



తడికలపూడిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

టి.నరసాపురం/ జంగారెడ్డిగూడెం/ ఏలూరు టూటౌన్/ కామవరపుకోట / భీమడోలు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక శాతం ఓట్లతో గెలిపించాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. మక్కినవారిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ ప్రచారంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అడపా నాగరాజు, జయ్యవరపు శ్రీరామ్మూర్తి, నాయుడు రామకృష్ణారావు గౌడ్, ఆచంట బాబీ, భీమవరపు జగన్మోహన్‌రావు, పిన్నమనేని మధు, లింగారెడ్డి శ్రీనివాసరావు, వాసిరెడ్డి నాని, సి.హెచ్.నవీన్, ఆళ్ళ వెంకట బాలాజీ, కాల్నీడి మురళీ, ఆర్.సురేష్ పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని చిదంబరం ఆసుపత్రి ఏరియాలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పారేపల్లి రామారావు, మండవ లక్ష్మణరావు, నంబూరి రామచంద్ర రాజు, తూటిగుంట రాము, పాతూరి అంబేద్కర్, మిడతా పెంటయ్య పాల్గొన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య(చంటి) కూటమి నాయకులతో కలిసి సోమవారం ఏలూరు నగరంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బలపర్చిన అభ్యర్థికి ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వన్‌టౌన్‌లోని ఎల్ఐసీ కార్యాలయంలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో షేక్ మీరావలి, చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు. లింగపాలెం మండలంలో ఉన్న పట్టభద్రులను కలిసి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను వారికి వివరించారు. పట్టభద్రులంతా రాజశేఖర్‌కు మద్దతుగా నిలవాలని కోరారు.కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలంటూ పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. కామవరపుకోట మండలంలోని ఆడమిల్లి, వీరంపాలెం, తడికలపూడి తదితర గ్రామాల్లో కూటమి నాయకులు జోరుగా ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో తూతా లక్ష్మణరావు, మేరుగు సుందరరావు, గూడపాటి కేశవరావు, జిజ్జూరి బాబ్జీ పాల్గొన్నారు. భీమడోలు మండలం గుండుగొలనులోని జడ్పీ హైస్కూల్లో ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్యే అంగర రామ్మోహనరావు, ఎమ్మెల్సీని గెలిపించాలని కోరుతూ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఇచ్చిన హామీల అమలుకు అంగన్‌వాడీల నిరసన

భీమడోలు/చింతలపూడి/కుక్కునూరు/బుట్టాయగూడెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ సమస్యల పరిష్కారం కోసం భీమడోలు సీడీపీవో కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భీమడోలు ప్రాజెక్టు అధికారి స్వర్ణ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. అనంతరం అంగన్‌వాడీల డిమాండ్లతో సీడీపీవో కార్యాల య అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలు, సంఘ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ చింతలపూడి ఐసీడీఎస్ పీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. సీఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.వి.ఎస్.నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా అంగన్‌వాడీల బతుకులు మారలేదన్నారు. అనంతరం ఐసీడీఎస్ పీవో మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో బి.జె.ఎన్. కుమారి, టి.మాణిక్యం, ఎన్.సరోజిని పాల్గొన్నారు. అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయి కిరణ్ ఆధ్వర్యంలో సీడీపీవో లక్ష్మీ కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ, రాధా, మంగా, రమణ, తదితరులు పాల్గొన్నారు. బుట్టాయగూడెం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించి అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సిడిపివో తులసికి అందజేశారు. యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి కె.పుష్ప మాట్లాడుతూ అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో కృపామణి, రామలక్ష్మి, భూదేవి, సుధా, వసుంధర, పార్వతి, వాణి, మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో ధర్నా చేస్తున్న అంగన్ వాడీలు



బుట్టాయగూడెంలో వినతిపత్రం ఇస్తున్న విలేకరులు


విలేకరిపై దాడి పట్ల నిరసన

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : పార్వతిపురంమన్యం జిల్లా మక్కువ మండలంలో విలేకరి మల్యాడ రామారావుపై దాడిచేసి చంపుతానని బెదిరించిన టీడీపీ నాయకుడు గుల్ల వేణుగోపాల నాయుడుపై చర్యలు తీసుకోవాలని సోమవారం బుట్టాయగూడెం ప్రెస్‌క్లబ్ సభ్యులు తహసీల్దార్ పివి చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.మధుబాబు, ఎ.నానాజీరావు, కె.మధుబాబు, ఎస్.రవి కుమార్, కె.క్రాంతినాథ్ పాల్గొన్నారు.

కుక్కునూరులో అధికారికి వినతి...

కుక్కునూరు : విలేకరిపై దాడికి నిరసనగా సోమవారం కుక్కునూరు తహసీల్దార్ రమేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టులపై జరిగే దాడులను అరికట్టి భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు జే.హరినాథ్, శ్రీనివాస్, నారాయణరాజు, శ్రీనివాసరాజు, చాన్‌భాష, వలిభాష, పోతురాజు, దావూద్, వేణు, విశ్వనాథ్, రమేష్, రహీం వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

డ్రైవర్ల సేవలను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వేలేరుపాడు, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా స్వయం ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్న కారు జీపు, ఆటో, ఇతర వాహనాల డ్రైవర్ల సేవలను ప్రభుత్వం గుర్తించి వారికి పీఎఫ్, ఈఎస్ఐ పింఛన్‌తో కూడిన సమగ్ర సంక్షేమ చట్టం చేసి డ్రైవర్లను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వేలేరుపాడు మండలం డ్రైవర్స్ యూనియన్ ఏఐటీయూసీ సర్వసభ్య సమావేశం సీపీఐ మండల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 లక్షల మంది డ్రైవర్లు ఉన్నారని, మరో 30లక్షల మంది నిత్యవసర వస్తువుల నిర్వహణ రంగంలో ఉన్నారని వీరంతా అరకొర జీతాలతోనే నెట్టుకొస్తున్నారని ఆయన తెలిపారు. వీరి సేవలను గుర్తించడంతో పాటు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రానున్నకాలంలో పెద్దఎత్తున ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుజ్జిబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, మండల సీపీఐ కార్యదర్శి రాము, డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు సూరిబాబు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మున్నీర్, పోలవరం నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి కారం దారయ్య, సన్నేపల్లి సాయిబాబు పాల్గొన్నారు.

జాతీయ డెంటల్ కన్వెన్షన్ పోటీల్లో దుగ్గిరాల విద్యార్థుల ప్రతిభ



అవార్డులు గెలుచుకున్న విద్యార్థుల సంబరం

పెదవేగి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ మేఘన డెంటల్ సైన్స్‌లో నిర్వహించిన రెండవ జాతీయ డెంటల్ కన్వెన్షన్ పోటీల్లో పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో త్రోబాల్, చెస్, మెహందీ పోటీల్లో ప్రథమ బహుమతి, పురుషుల ఫ్యాషన్ షోలో మిస్టర్ ఎన్‌డీసీ రెండో బహుమతి, పురుషుల టీత్ అరేంజ్మెంట్‌లో రెండో బహుమతి, మెరిట్ ఎగ్జామినేషన్‌లో మూడో బహుమతిని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా దంత వైద్య కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన దంతవైద్య విద్యార్థులు, పీడీ ఎన్.నల్లయ్యలను కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు అభినందించారు.

శివరాత్రికి ఏర్పాట్లు

పెదవేగి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన బలివే శ్రీరామలింగేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నామని విజయరాయి సొసైటీ మాజీ అధ్యక్షుడు, టీడీపీ పెదవేగి మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్ అన్నారు. పెదవేగి మండలం విజయరాయి సమీపంలోని తమ్మిలేరులో మహాశివరాత్రి సమయాన భక్తులు వేలాదిగా తరలివచ్చి పితృదేవతలకు పిండప్రదానం చేస్తారు. ఈ నేపథ్యంలో ఘాట్ల ఏర్పాట్లను టీడీపీ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన భక్తులు తమ్మిలేరులో పండప్రదానాలు చేసి, ఆపై బలివే శ్రీరామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటారని చెప్పారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచనలతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెదర్ల నానీ, రావిపాటి పిచ్చియ్య చౌదరి, ఎం.శ్రీనివాసరావు, పామర్తి భూషణం, జనసేన నాయకుడు మేడిచర్ల కృష్ణ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

రోడ్ల మరమ్మతులకు చర్యలు

మద్దాల శేషకుమార్, ఆర్‌అండ్‌బీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్



● దెందులూరు మండల పరిధిలో రోడ్ల పరిస్థితి ఏమిటి?

జవాబు : ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని రాష్ట్ర స్థాయి రోడ్లు 37 కిలోమీటర్లు ఉండగా, జిల్లా స్థాయి రహదారులు 21 కిలోమీటర్ల పొడవు ఉన్నాయి. ఇందులో 32 కిలోమీటర్ల మేర రోడ్లు పాడయ్యాయి. నవంబరు 2 నుంచి రూ.2 కోట్ల 46 లక్షలతో గుంతలను పూడ్చే పనులు చేపట్టాం.

● దెందులూరు - పంగిడిగూడెం రోడ్డు పరిస్థితి ఏమిటి?

జవాబు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.కోటి 25 లక్షలతో 11 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేశాం. ఈ రోడ్లలో అత్యంత కీలకమైన జంగారెడ్డిగూడెం రోడ్డు మరమ్మతులకు రూ.13 లక్షలు కేటాయించాం. జోగన్నపాలెం రోడ్డును రూ.20 లక్షలతో మరమ్మతులు చేస్తున్నాం.

● కొల్లేరు రోడ్ల పరిస్థితి ఎలా ఉంది?

జవాబు : పాలగూడెం తూర్పు లాకుల నుండి కొవ్వలి, పోతునూరు, ఆగడాలలంక వరకు రూ.13 లక్షలతో రోడ్లపై ఉన్న గుంతలు పూచే పనులు చేపట్టాం. అలాగే పాలగూడెం రోడ్డులో 10 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డుగా మార్చాల్సి ఉంది.

● ప్రజలకు మీరిచ్చే సలహా ఏమిటి?

జవాబు : ప్రభుత్వం రోడ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. కొంత మంది ట్రాక్టర్ యజమానులు ఇనుప చక్రాలతో రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే గ్రామాల పరిధిలోని ఇళ్లలోని వాడకపు నీరు రోడ్లపైకి వదిలేస్తున్నారు. వీటి వల్ల కూడా రోడ్లు పాడవుతున్నాయి.

\- దెందులూరు

ప్రైవేటుకు అప్పగించొద్దు

చింతలపూడి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ ఉద్యోగ కార్మికుల వేతనాల చెల్లింపు బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే చర్యలను విరమించుకోవాలని కోరుతూ మునిసిపల్ కమిషనర్ డి.పావనికి కార్మికులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఐటియూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి టి.బాబు మాట్లాడుతూ ప్రైవేటు కంపెనీలు, ఏజెన్సీల వల్ల ఉపయోగంలేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో వి.రాధ, వి.బాలు ఉన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం, బుధవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నారు. కైకరం గ్రామంలో కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు నిమిత్తం రెండ్రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని, వినియోగదారులు సహకరించాలని గొల్లగూడెం ఏ.ఈ.వేణు కోరారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : పొగాకు క్యూరింగ్ సమయంలో బ్యారన్‌లో ఉడికిస్తున్న పొగాకు అగ్ని ప్రమాదానికి దగ్ధమైంది. సమాచారాన్ని తెలుసుకున్న జంగారెడ్డిగూడెం ఫైర్ అధికారులు సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. బాధిత రైతు కొప్పుల ప్రసాద్ రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. పొగాకు బోర్డు అధికారులు రైతు సంక్షేమ సంఘం నాయకులు ఆదుకోవాలని కోరారు.

ఘనంగా శిఖర ప్రతిష్ఠ

పెదపాడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం వట్లూరు పంచాయతీ పరిధిలోని సీతారాంపురంలో నూతనంగా నిర్మించిన భద్రాద్రి సీతారామచంద్ర స్వామి ఆలయంలో విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హ్యాండ్ మైక్ బహూకరణ

ఏలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణంలోని బాలాజీ నగర్ ప్రాథమిక పాఠశాలకు అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రూ.ఏడు వేలు విలువైన హ్యాండ్ మైక్ అందచేయడం అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి-1 బి.రాముడు అన్నారు. సోమవారం ఎంఈవోలు బి.రాముడు, జి.రాములు చేతుల మీదుగా ఆ పాఠశాల ఉపాధ్యాయులకు మైక్ అందజేశారు. ఈ సందర్భంగా దాతలు ఎల్.శ్రీనివాస్, ఉషారాణి దంపతులను కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.రంగా, ఎన్.ప్రభాకరరావు, లక్ష్మణరావు, బాజీ, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల నివాళి

ఏలూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన దివంగత సీపీఐ నేత చెరుకూరి కోటేశ్వరరావు సతీమణి రాజ్యలక్ష్మి మృతి పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జెవి.రమణరాజు, కుంచె వసంతరావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

సభను జయప్రదం చేయండి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రెండు పార్టీలకు చెందిన విలీన సభ ఈ నెల 23న విజయవాడలో జరుగుతుందని సభకు భారీగా ప్రజలు హాజరై జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు ధర్మాల సురేష్ పిలుపునిచ్చారు.

ప్రాణాలు తీసిన మంచు

రోడ్డు ప్రమాదంలో నూజివీడువాసి మృతి

మరో ఇద్దరికి స్వల్పగాయాలు

బెంగళూరు నుంచి వస్తుండగా మార్టూరు వద్ద ఘటన





ప్రమాదానికి గురైన కారు.. మృతి చెందిన జూలూరి కృష్ణ (ఫైల్)

మార్టూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా మార్టూరు మండల పరిధిలో జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన కారు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి గురైన కారు ఏలూరు జిల్లా నూజివీడుకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన జూలూరి కృష్ణ(35), కాగా స్వల్ప గాయాలతో బయటపడిన అతని తమ్ముడు జూలూరి వంశీకృష్ణ, బంధువు కొప్పురావూరి వివేకానంద మహర్షిగా పోలీసులు తెలిపారు. కృష్ణకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు, అబ్బాయి ఉన్నారు. ముందువెళుతున్న గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి కారు బలంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కారు మధ్య సీటులో నిద్రిస్తున్న కృష్ణకు బలమైన గాయాలు కావడంతో అతను మృతి చెందా రు. కారును నడుపుతున్న కృష్ణ తమ్ముడు వంశీకృష్ణ, మరో వ్యక్తి కే వివేకానంద మహర్షి స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. వారిని 108లో చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం వారు మణిపాల్ హాస్పిటల్‌కు వెళ్లినట్లు తెలిసింది. ఇదిలా వుండగా కారులోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో వారిద్దరూ ప్రాణాలతో బయట పడ్డారని పోలీసులు తెలిపారు. కారు ఢీకొన్న ముందున్న వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. ఉదయం సమయంలో మంచుగా ఉండటం, డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి నిద్రమత్తులో ఉండడం తదితర కారణాలతో ప్రమా దం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తు న్నారు.

నూజివీడు నుంచి బెంగళూరు వెళ్లి వస్తుండగా ప్రమాదం

నూజివీడులో సూసర్లవారివీధిలో వైశ్య ఫార్మా మెడికల్స్ వ్యాపారం నిర్వహిస్తున్న జూలూరి కృష్ణ, తమ్ముడు వంశీకృష్ణ, విజయవాడలో ఉంటున్న బంధువు వివేకానంద మహేష్‌తో కలిసి శుక్రవారం రాత్రి కారులో బెంగళూరులో ఉంటున్న చెల్లెలు వద్దకు వెళ్లారు. తన దగ్గర ఉన్న చెల్లెలు కారును ఆమెకు ఇచ్చి ఆమె దగ్గర ఉన్న తమ కారును తీసుకొని తిరిగి ఆదివారం రాత్రి వారు నూజివీడుకు కారులో బయలు దేరారు. మార్టూరు వద్ద వారి కారు ప్రమాదానికి గురైంది. మృతి చెందిన కృష్ణ తండ్రి సీతారామాంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శవపంచనామా నిర్వహించిన అనంతరం కృష్ణ మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం చేశారు. తరువాత బంధువులకు అప్పగించారు. ఎస్‌ఐ సైదా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గేటు..దాటేదెలా..!

- రైల్వేగేట్ల వద్ద ప్రయాణికుల పాట్లు
- భారీగా నిలుస్తున్న ట్రాఫిక్
- అండర్ పాస్ లేదా ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలంటూ డిమాండ్



కైకలూరులో రైల్వేగేటు వద్ద భారీగా నిలిచిన ట్రాఫిక్

కైకలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నిత్యం రైల్వేగేట్ల వద్ద ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ఒక రోజులో 60 నుంచి 70 రైళ్ల రాకపోకలు సాగించడంతో ఆయా రహదారుల్లోని రైల్వేగేట్ల వద్ద ప్రత్నామ్నాయ మార్గాలు లేక గేటు తీసేవరకు ఎండైనా, వానైనా వాహనదారులు వేచి ఉండాల్సిన పరిస్థితి. గేటు తీసిన సమయంలో ఎదురెదురుగా రాకపోకలు సాగించడంతో గేటు ఉన్న ప్రదేశంలో ఇరుకుగా ఉండడం భారీ వాహనాలు తప్పుకునేందుకు ఎలాంటి అవకాశం లేక ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కైకలూరు నియోజకవర్గంలో గుడివాడ-భీమవరం రైల్వేమార్గం డబుల్‌లైన్ ట్రాక్ కావడం వల్ల నిత్యం 60-70 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో అత్యధికంగా 35 వరకు రైళ్లు గూడ్స్ రైళ్లు ప్రయాణించడంతో ఏ సమయంలో గేటు వేసేది తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రైలు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉండగానే గేటు మూసివేస్తున్నారు. కైకలూరులో కలిదిండి వెళ్లే రహదారిలో 82వ రైల్వేగేటు, కోరుకొల్లు వెళ్లే రహదారిలో 81వ రైల్వేగేటు వద్ద భారీగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కొక్కసారి గేటు వేస్తే మూడు రైళ్ల రాకపోకలు సాగించే వరకు తీయకపోవడంతో 30 నిమిషాలు పైబడి రైల్వేగేట్ల వద్ద వాహన దారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కైకలూరు రైల్వేస్టేషన్ నుంచి గోపవరం రైల్వేగేటుకు 200 మీటర్ల దూరంలో ఉంటుంది. రైల్వే స్టేషన్ అవతల నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో రైలు ఉండగా ఈ గేటు మూసి వేయడంతో ప్రజలు మరింత అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. గుడివాడ వైపు వెళ్లే రైళ్లు స్టేషన్ కు వచ్చిన తర్వాత గేటు మూసేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కైకలూరు నియోజకవర్గంలో మొత్తం 17 రైల్వేగేట్లు ఉండగా దాదాపు అన్ని రైల్వేగేట్లలో ఇదే పరిస్థితి. కైకలూరు నుంచి మండవల్లి వెళ్లే ఎన్‌హెచ్ రహదారిలో 79వ రైల్వేగేటు వద్ద మరిన్ని ఇబ్బందులను ఎదుర్కొంటు న్నా రు. జాతీయ రహదారి పై రైల్వేగేటు సైతం 20 నుంచి 30 నిమిషాలు మూసి వేయడంతో వాహ నాలు బారులు దీరుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళ విద్యార్థులు, ఉద్యోగులు ఈ రహదారుల వెంబ డి ప్రయాణించాలంటే పడరానిపాట్లు పడుతు న్నారు. ఈ మార్గాల్లో రైల్వే అధికారులు ఇప్పటికైనా అండర్ పాస్ లేదా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



గేటు పడితే అరగంట ఆగాల్సిందే..

మండవల్లి : మండవల్లిలో మండవల్లి-ఇంగిలిపాకలంక రహదారిలో రైల్వేగేటు పడింది అంటే మరల తీయడానికి అరగంట పైనే సమయం పట్టడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ గేటు మార్గంలోనే సచివాలయం, రెవెన్యూ, మండల పరిషత్, విద్యాశాఖ, మహిళా సమాఖ్య శాఖ, పశువైద్యశాల వంటి ప్రధాన కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంది. కార్యాల యాలకు వివిధ పనుల మీద వచ్చే ప్రజలతో పాటు అధికారులు సైతం ఈ గేటు వల్ల అవస్థలు పడుతున్నారు. రైలు వచ్చే 15 నిమిషాలు ముందే గేటు వేయడం, కనీసం రెండు రైళ్లు వెళ్లే వరకు గేటు తీయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ భారీస్థాయిలో నిలిచి పోతున్న రైల్వేశాఖ అధికారులకు ఏమి పట్టనట్టు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



ముదినేపల్లి మండలం శ్రీహరిపురంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న కూటమి నేతలు

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ముదినేపల్లి/కలిదిండి/కైకలూరు/ముసునూరు/ఆగిరిపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి అభ్యర్థి ఎన్నికల ప్రచారం ముమ్మరంగా జరుగుతోంది. ముదినేపల్లి మండలంలో సోమవారం శ్రీహరిపురంలో సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షురాలు సత్యవేలు నాగలక్ష్మి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ముదినేపల్లి, అల్లూరు, బొమ్మినంపాడు, పెదగొన్నూరు, పెద పాల్రు, వూటుకూరు తదితర గ్రామాల్లోను కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. కలిదిండి మండలం కోరుకొల్లులో మాజీ ఎంపీపీలు వలవల రామారావు, చెన్నంశెట్టి మురళీ కృష్ణ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు తోట అంజనేయులు, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, తదితరులు ప్రచారం చేశారు. కైకలూరులో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజెఎస్ మాల్యాద్రి, జిల్లా కార్యనిర్వాహక కార్య దర్శి పోలవరపు లక్ష్మీరాణి, పలువురు కూటమి నాయకులు, భుజబలపట్నంలో మాజీ జడ్పీటీసీ ముదునూరి సీతారామరాజు, మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథ రాజు ఆధ్వర్యంలో, వేమవరప్పాడులో కూటమి నేతలు తేరా రమేష్‌బాబు, కీర్తి వెంకట రాంప్రసాద్, బోడావుల జగదీష్, బొల్లా శ్యామల రాజు తదితరులు పట్టభద్రుల ఓట్లను అభ్యర్థించారు.

ముసునూరు మండలం వలసపల్లిలో మేదర మెట్ల సురేంద్ర, అలూరి సీతారామరాజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆగిరిపల్లి మండలంలోని అడవినెక్కలం, నెక్కలం గొల్లగూడెం, ఈదర, ఆగిరిపల్లి, కనసానపల్లి, ఈదులగూడెం, సురవరంలో టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. మడుపల్లి గోపాల్, చిట్టినేని శివరామకృష్ణ, ఆరేపల్లి శ్రీనివాసరావు, నక్కన బోయిన వేణు, మాదల సత్యకుమార్, విక్టర్ బాబు, పి.నరసయ్య, ఏసుపాదం, శ్రావణ్, కె.బాబురావు, సత్యనారాయణ, దుప్పుల సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

కలిదిండి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కలిదిండి ప్రజా సంఘాల కార్యాలయంలో రైతాంగ సమస్యలపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతులకు పెట్టుబడులు రాక నష్టపోయి అప్పుల పాలవుతున్నారన్నారు. ఆక్వా రైతుల సంక్షేమానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పంట కాల్వల ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలన్నారు. కృష్ణా డెల్టా పరిధిలో కాల్వల ఆధునికీకరణకు నిధులు కేటాయించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు, రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా షిర్డీ సాయి బాబా విగ్రహ ప్రతిష్ఠ



మండవల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండవల్లిలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా సంకీర్తన మందిరంలో బాబా విగ్రహాన్ని వేదమంత్రాలు మధ్య మేళతాళాలతో సోమవారం ప్రతిష్ఠించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ఛత్తీస్‌ఘడ్ హైకోర్టు తీర్పు పునఃసమీక్షించాలి

చాట్రాయి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భార్యపై అసహజ శృంగారం నేరం కాదని ఛత్తీస్‌ఘడ్ హైకోర్టు తీర్పును పునఃసమీక్షించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి తీర్పుతో స్త్రీలపై లైంగిక హింస పెరిగే ప్రమాదం ఉందన్నారు.

కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆ దిశగా 20న చంద్రబాబు, పవన్‌లను కలిసి వివరిస్తాం..

ప్రభుత్వం తరపున అప్పీలు కెళ్తాం

ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్

ఏలూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యేలు, కొల్లేరు ప్రజల సహకారంతో ముందడగు వేస్తామని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తెలిపారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. 'కొల్లేరు అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉండటం వల్ల ఆక్రమణలు కొట్టడం అనేది అధికారులు తమ పని చేసుకుంటూ వెళ్తున్నారు. అక్కడ ప్రజల మనోభావాలకు అను గుణంగా ఈ సమస్యను తీర్చాల్సిన బాధ్యత మాపై ఉంది. సుప్రీంకోర్టు తీర్పు అమలు వల్ల హైకోర్టుకు ఈ అంశం రావడం లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కొల్లేరు సమస్యను అస్సలు పట్టించుకోలేదు.

ఈ నేపథ్యంలో కొల్లేరుపై ఈ నెల 20న మాట్లాడటానికి రావాలని సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్‌లతో కలిసి కూలంకషంగా పరిస్థితిని వివరిస్తాం. దీనిపై ప్రభుత్వం తరపున లాయర్‌ను పెట్టి అప్పీలుకు వెళ్లి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మహేశ్ స్పష్టం చేశారు. మొదట ప్రజల తరఫున పిటిషన్ వేయాలని భావించాం. న్యాయ నిపుణుల సలహా మేరకు ప్రభుత్వమే పిటిషన్ దాఖలు చేస్తుంది. అదే విధంగా మరోసారి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతాం' అని వివ రించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి గా పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించి తీరు తామని, దీనిపై ప్రచారం జోరుగా సాగుతోంద ని ఎంపీ మహేశ్‌కుమార్ వివరించారు.

పాత కక్షలతో ఇరు వర్గాల ఘర్షణ

ఎనిమిది మందికి తీవ్ర గాయాలు



ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పాతకక్షలు నేపథ్యంలో రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో అటు నలుగురు, ఇటు నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈసంఘటనపై రెండు వైపులా ఫిర్యాదుల అందడంతో ఏలూరు రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలోని గురుకుల పేటలో అధికార పార్టీ నాయకుడు గుర్రం తాతా రావుకు, ఆ గ్రామ ఎంపీటీసీ అయిన గండికోట నాగరాజు మధ్య గొడవలు ఉన్నాయి. నాగరాజు గతంలో వైసీపీ కాగా ప్రస్తుతం టీడీపీలో చేరారు. అయినప్పటికీ వీరంతా ఒకే పార్టీ అయినా పాత కక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం ఉపాధి పనికి వెళ్ళి తిరిగి వస్తుండగా ఒకరిపై ఒకరు తమ్మిలేరు ఏటిగట్టు వద్ద కర్రలతో దాడు లకు తెగబడ్డారు. ఈ దాడుల్లో గుర్రం తాతా రావు కుటుంబానికి చెందిన రాజు, శివాజీ, రమణమ్మ, రాజేశ్వరులు తీవ్రంగా గాయపడ్డారు. మరో వర్గానికి చెందిన వారైన గండికోట నాగ రాజు, గుర్రం వెంకటేశ్వరరావు, గుర్రం తిరుపతి వెంకన్న, వీరబాబు గాయపడ్డారు. క్షతగాత్రులు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. దాడి సమాచారం తెలుసుకున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వచ్చి ఇరువురిని పరామర్శించారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి. సత్యనారాయణ, వన్‌టౌన్ ఎస్‌ఐ నాగబాబు, ఏలూరు రూరల్ ఎస్‌ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ వారి సిబ్బంది ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు గురకలపేట వద్ద స్పెషల్ పార్టీ పోలీసులతో పికెట్‌ను ఏర్పాటు చేశారు.

కొల్లేరు ఉత్సవాలపై నేడు కోఆర్డినేషన్ కమిటీ సమావేశం

కైకలూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఉత్సవాలపై కోఆర్డినేషన్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద వివిధ శాఖల అధికారులతో సమావేశం జరుగుతుందని, ఆయా శాఖల అధికారులు విధిగా పాల్గొనాలని కోరారు. ఉత్సవాలను మార్చి 1 నుంచి 13వ తేదీ వరకు వైభవంగా జరపనున్నట్టు తెలిపారు.

విద్యార్థుల విహార యాత్రలకు శ్రీకారం

ముదినేపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల విద్యార్థుల విహార యాత్రలు మళ్లీ మొదలయ్యాయి. చాలాకాలంగా విద్యార్థుల విహార యాత్రలకు బ్రేక్ పడగా, విద్యాశాఖ తిరిగి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ముదినేపల్లి మండలం చినకామనపూడి యూపీ స్కూల్ విద్యార్థులు ఆదివారం స్కూల్ హెచ్‌ఎం పుట్టి గణేష్ బాబు, టీచర్ల ఆధ్వర్యంలో మచిలీపట్నం బీచ్‌కు వెళ్లి అక్కడి ఆహ్లాదకర వాతావరణం, సముద్ర తీర ప్రాంతాన్ని తిలకించారు. చిలకలపూడి పాండురంగ స్వామి ఆలయాన్ని, శివాలయాన్ని దర్శించారు. గోల్డ్ కవరింగ్ కార్యకలాపాలను చూసి నగల తయారీని తెలుసుకున్నారు.



మచిలీపట్నం బీచ్‌లో విద్యార్థుల సందడి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వైసీపీ బ్యానర్‌కు ముసుగు

ముసునూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలు ఎక్కడ? శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. బసవరపుపాడు ప్రధాన రహదారి పక్కన వైసీపీ బ్యానర్‌ను సోమవారం ఎంపీడీవో జి.రాణి పరిశీలించారు. బ్యానర్‌కు కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సిబ్బంది ముసుగు వేశారు. గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని సమర్థవంతంగా అమలు చేయకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు.

సినీ నటి కృష్ణవేణి మృతికి సంతాపం

చాట్రాయి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా రంగంలో తొలితరం కథానాయకి, తొలి తెలుగు మహిళా నిర్మాత, రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత కృష్ణవేణి మృతికి తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టీడీపీ మండల నాయకులు నక్కా రాము సంతాపం తెలిపారు. మనదేశం చిత్రం ద్వారా తెలుగు వారి ఆరాధ్య నటుడు ఎన్టీఆర్‌ను వెండితెరకు పరిచయం చేయటమే కాక, నిర్మాతగా అనేక గొప్ప కళా ఖండాలు నిర్మించారని, నటిగా ఎన్నో గొప్ప పాత్రలకు ప్రాణపతిష్ట చేసి అఖండ కీర్తి ప్రతిష్టలు గడించారన్నారు.

కాంట్రాక్టర్‌తో చేయించిన పనులు రద్దు చేయండి

నూజివీడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను కాంట్రాక్టర్లతో చేయించడంపై విచారణ నిర్వహించాలని గన్నవరం జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి కోరారు. వైసీపీ నాయకులతో కలిసి ఆర్డీవో కార్యాలయ అధికారులకు సోమవారం ఆమె వినతిపత్రం అందించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉపాధి పనులను కాంట్రాక్టర్లతో చేయించారని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ముసునూరు, బాపులపాడు, ఆగిరిపల్లి జడ్పీటీసీలు ప్రతాప్, కొమరవల్లి భవాని, పిన్నిబోయిన వీరబాబు తదితరులు ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

బలివే ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



స్నాన ఘాట్‌లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ముసునూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఉత్సవాల ఏర్పాట్లును సోమవారం ఆయన పరిశీలించారు. తమ్మిలేరులో స్నానాల ఘట్లు, జల్లుల స్నానాలు, తాత్కలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని, బారికేడ్ల నిర్మాణం తదితర ఏర్పాట్లును ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 27 వరకు జరిగే ఉత్స వాలకు లక్షల్లో భక్తులు వచ్చే ఆవ కాశం ఉందన్నారు. మంచినీరు, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యం, భద్రత, క్యూలైన్లులతోపాటు భక్తుల పుణ్య స్నానాలకు ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవ దాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వ యంతో ఉత్సవాలను విజయవంతం చేయాల న్నారు. డీఎల్‌పీవో సుందరి, తహసీల్దార్ కె.రాజ్ కుమార్, ఎంపీడీవో జి.రాణి, ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య, ఈవోపీఆర్డీ బీపీ సత్యనారయణ, తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి, తోటపల్లి ఆలయాల్లో హుండీ ఆదాయం గన్నవరం తనిఖీ అధికారి అనురాధ పర్యవేక్షణలో ఆలయ ఈవో సీహెచ్ సాయి ఆధ్వర్యంలో లెక్కింపు జరిగింది. ఆగిరిపల్లి శోభనాచలస్వామి వారి ఆలయంలో హుండీ ఆదాయం రూ. 2,67,360, తోటపల్లి దుగ్గిరాల బాలరావమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.2,63,991 వచ్చినట్లు తెలిపారు.

రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని వినతి



ఎంపీకి విజ్ఞప్తి చేస్తున్న బీజేపీ నాయకులు

నూజివీడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాల అభివృద్ధికి అవకాశం కల్పించే గుడివాడ - మధిర నూతన రైల్వేలైన్‌ను చాట్రాయి, ముసునూరు, నూజివీడు మీదుగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు గోగినేని శ్రీనివాసకుమార్ అప్పారావు, చాట్రాతి రామకృష్ణ ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఏలూరులోని ఆయన కార్యాలయంలో ఎంపీ మహేష్ కుమార్‌ను కలిసిన వారు సీఆర్ఎఫ్ ద్వారా గ్రామీణ మండల ప్రాంతాల అభివృద్ధికి పనులు చేపట్టే అవకాశం ఉందని మంత్రి కొలుసు పార్థసారథి ఇప్పటికే రైల్వేలైన్ గురించి చీఫ్ ఇంజనీర్‌కు ఎండార్స్ చేసిన విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పుట్టా మహేష్ మాట్లాడుతూ రైల్వేలైన్ విషయమై మంత్రులు నారా లోకేశ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో మాట్లాడినట్లు వివరించారు.

విలేకరిపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా పార్వతీపురం ప్రజాశక్తి విలేకరిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు విలేకర్లు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. దాడి దారుణమని టీడీపీ మండల అధ్యక్షుడు జి.వేణుగోపాలనాయుడు అన్నారు. చాట్రాయి తహసీల్దార్ కార్యాలయం, ముసునూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

అంగన్‌వాడీల ఆందోళన

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీలు ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, అద్దెలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటేశ్వరమ్మ, ప్రసన్న, మణి తదితరులు పాల్గొన్నారు.

కామన్ పీజీ సెట్ రద్దు చేయాలి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కామన్ పీజీసెట్ విధానాన్ని రద్దు చేసి యూనివర్శిటీల వారీగా పీజీ ప్రవేశాలు నిర్వహించేవిధంగా ఉత్తర్వులు జారీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. నూజివీడు డీఏఆర్ కళాశాల వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నారా లోకేశ్ విద్యార్థుల సమస్యలను సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారే కాని అనంతరం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎం.క్రాంతి కుమార్, నాయకులు నవీన్, వరుణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని బలవంతంగా తీసుకువెళ్లిన ఇద్దరిపై కేసు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ చదువుతున్న బాలికను బలవంతంగా ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లిన ఇద్దరిపై నూజివీడు పట్టణ పోలీసులు కేసునమోదు చేశారు. పట్టణంలోని అజరయ్యపేటకు చెందిన ఇద్దరు యువకులు తమ సమీప బంధువు అయిన బాలికను మాయమాటలు చెప్పి ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించారు. వారి నుంచి తప్పించుకున్న బాలిక ఇంటికి చేరి తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.